ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
తిరుపతి
జిల్లా వార్తలు
సోమవారం
26 ఆగస్టు 2024



నేడు శ్రీకృష్ణాష్టమి

- **ఇస్కాన్‌లో మొదలైన వేడుకలు**

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 25: గోపబాలుడి జన్మదిన వేడుకలు ఏడుకొండల ముంగిట ముందుగానే ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం నుంచే తిరుపతిలోని ఇస్కాన్ శ్రీకృష్ణ మందిరంలో రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆరు గంటలకు ఆదివాసీ ఉత్సవం నిర్వహించారు. 6.30 గంటల నుంచి ఆలయం ఎదురుగా ఉన్న టీటీడీ క్రీడామైదానంలో పలు సంగీత, నృత్య కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ పరిసరాలను వివిధ రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

8 నుంచి రాత్రి 11.45 గంటల వరకు భక్తులకు దర్శనం

సోమవారం శ్రీకృష్ణ జయంతి సందర్భంగా ఇస్కాన్ మందిరంలో వేకువ జామున 4 గంటల నుంచి మంగళహారతి, తులసి పూజ, నరసింహ కీర్తన జరుగుతాయి. ఎనిమిది నుంచి రాత్రి 11.45 గంటల వరకు భక్తులకు దర్శనం ఉంటుంది. సాయంత్రం 4 గంటలకు టీటీడీ మైదానంలో ఉట్లోత్సవం జరుగుతుంది. 6.30 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు ఉంటాయి. రాత్రి 11గంటలకు రాధాగోవిందులకు మహాశంఖాభిషేకం జరుగుతుంది.


విద్యుత్ దీపాలంకరణ




ఇందిరా మైదానంలో వేదిక, ద్వారకలోని మధుర సెట్టింగు

ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్ డిజైన్ రెడీ


ఇంటిగ్రేటెడ్ బస్సు టెర్మినల్ నమూనా

- సీఎం చంద్రబాబు ఆమోద ముద్రే తరువాయి
- తిరుపతిలో రూ.500 కోట్లతో కొత్త బస్టాండుకు త్వరలో శంకుస్థాపన
- కేంద్ర కమిటీ సభ్యుల పరిశీలన


సీబీఎస్ ప్రాంగణంలో సందర్శిస్తున్న కేంద్రబృందం

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 25: తిరుపతిలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఇంటిగ్రేటెడ్ బస్సు టెర్మినల్ నిర్మాణానికి త్వరలో పునాదిరాయి పడనుంది. ఇప్పటికే పూర్తయిన బస్ టెర్మినల్ డిజైన్‌కు సీఎం చంద్రబాబు ఆమోద ముద్ర పడగానే పట్టాలెక్కనుంది. రూ.500కోట్ల బడ్జెట్‌తో నిర్మాణం కానున్న ఈ బస్సు టెర్మినల్‌పై నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) సీఈవో ప్రకాష్‌గౌర్ నేతృత్వంలో కేంద్ర బృందం ఆదివారం తిరుపతిలోని ఆర్టీసీ బస్టాండు ప్రాంగణాన్ని పరిశీలించింది. ఆర్టీసీ అధికార, అనధికార సభ్యులతో సమీక్షించింది. కొత్త డిజైన్‌ను పరిశీలించి.. ప్రయాణికులకు కల్పించే సదుపాయాలు, వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, మరుగుదొడ్లు, ప్లాట్‌ఫామ్స్, కార్యాలయాలు, మినీ గ్యారేజీ, ప్రవేశం, నిష్క్రమణ ద్వారాలు, నలువైపులా రహదారులు, పారిశుధ్యం, విద్యుత్, ప్రైవేటు వాహనాల పార్కింగ్, రైల్వేస్టేషన్ నుంచి జాయింట్ బ్రిడ్జి, అండర్ పార్కింగ్ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ.. దాదాపు రూ.500కోట్ల వ్యయంతో పది అంతస్తులతో అధునాతన భవనం నిర్మాణం అద్భుతంగా ఉంటుందన్నారు. అయితే ఎలక్ట్రిక్ బస్సుల రీచార్జింగ్ కేంద్రాలు పలుచోట్ల ఏర్పాటు చేసుకుంటే ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఉంటుందని, అత్యవసర పరిస్థితి దృష్ట్యా మినీ గ్యారేజీ ఏర్పాటు చేసుకుంటే సరిపోతుందని అభిప్రాయపడ్డారు. వచ్చే 30 ఏళ్లవరకు సమస్య లేకుండా నిత్యం ఐదువేల బస్సుల రాకపోకలు, 2.5లక్షలమంది ప్రయాణికుల సందర్శనకు అనుకూలంగా ఉంటుందన్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా భవనాన్ని దశలవారీగా పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. నగర శివార్లలో డిపోలు, గ్యారేజీలు ఉండాలని సూచించారు. మున్సిపల్, తుడ, పొల్యూషన్, ఫైర్, విమానయాన, విద్యుత్ విభాగాలను సంప్రదించి అనుమతులు ఇప్పించాలన్నారు. డిజైన్లను త్వరలో సీఎంకు అందజేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం లభించిన వెంటనే పనులు ప్రారంభిస్తామని, మూడేళ్లలో పూర్తవుతుందన్నారు. వారం వ్యవధిలోనే తగిన చర్యలు చేపట్టాలని ఆర్టీసీ అధికారులను, ఎంపీని కోరారు. బస్టాండుకు ఆగ్నేయంలో ఉన్న ప్రైవేటు స్థలం సమస్యను కొలిక్కి తేవాలన్నారు. దాంతో ఎంపీ కల్పించుకుని కలెక్టర్‌తో సంప్రదించి వారికి ప్రత్యామ్నాయంగా మరోచోట స్థలం ఇవ్వాలని కోరతామన్నారు. నమూనాలో కొంత మార్పులు చేర్పులు ఉండడంతో కాస్త ఆలస్యమవుతోందని అభిప్రాయపడ్డారు. టీడీపీ నేత మబ్బు దేవనారాయణ రెడ్డి, జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, ఆర్టీసీ అధికారులు నరసింహులు, భాస్కర్ రెడ్డి, రామచంద్రనాయుడు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అధికారిక సమీక్షల్లో జనసైనికులు



కేంద్ర కమిటీ సభ్యులు నిర్వహించిన సమీక్షలో జనసేన ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు పాల్గొనడం చర్చకు దారితీసింది. ఎన్‌హెచ్ఏఐ సీఈవో అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఓవైపు ఎంపీ గురుమూర్తి ఆశీనులవ్వగా మరోవైపు జనసేన నగర అధ్యక్షుడు రాజారెడ్డి కూర్చొన్నారు. 'వేర్ ఈజ్ ఎమ్మెల్యేజీ' అని సీఈవో అడిగితే.. అనివార్య కారణాలతో రాలేకపోయారని తమను పంపినట్టుగా అక్కడికి వచ్చిన జనసైనికులు సమాధానమివ్వడంతో ఒకరిముఖాలు ఒకరు చూసుకున్నారు. అధికారిక కార్యక్రమాల్లో జనసైనికులు పాల్గొనకూడదని ఓవైపు ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హెచ్చరిస్తున్నప్పటికీ తిరుపతి జనసైనికులు మాత్రం చెవికెక్కించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎన్‌హెచ్ఏఐ ప్రతినిధులను కలిసిన ఆరణి

ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్ నిర్మాణానికి సంబంధించి తిరుపతికి వచ్చిన కేంద్ర కమిటీ ప్రతినిధులను స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆదివారం సాయంత్రం హోటల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్‌హెచ్ఏఐ సీఈవో ప్రకాష్‌గౌర్, ప్రాజెక్టు డైరెక్టర్ పూజా మిశ్రాలను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం నూతన బస్సు టర్మినల్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చంద్రబాబు గతం(2014-19)లో సీఎంగా ఉన్నప్పుడు బస్సు టెర్మినల్ నిర్మించాలని నిర్ణయించారని, జగన్‌రెడ్డి వచ్చాక పట్టించుకోకుండా గాలికొదిలేశారన్నారు. నవంబరులోపు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి.. మార్చిలో కొత్త టర్మినల్ పనులకు శ్రీకారం చుడతామన్నారు. మళ్లీ చంద్రబాబు సీఎం కావడంతో తిరుపతివాసుల చిరకాల కోరిక నెరవేరిందన్నారు. ఈ భేటీలో జిల్లా ప్రజారవాణాధికారి చెంగల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మేనకూరులో విషాద ఛాయలు


మేనకూరులో రమేష్‌బాబు ఇల్లు

- అమెరికాలో జరిగిన కాల్పుల్లో వైద్యుడి మృతితో కుటుంబీకులు, స్థానికుల దిగ్ర్భాంతి


అమెరికాలో అవార్డు అందుకుంటున్న రమేష్‌బాబు (ఫైల్ ఫొటో)

నాయుడుపేట టౌన్, ఆగస్టు 25: అమెరికాలో జరిగిన కాల్పుల్లో డాక్టర్ పేరంశెట్టి రమేష్‌బాబు మృతి చెందాడని తెలియడంతో ఆయన స్వగ్రామమైన నాయుడుపేట మండలం మేనకూరులో ఆదివారం విషాదఛాయలు అలుముకున్నాయి. చిన్న గురునాథం - రాజేశ్వరమ్మ దంపతుల మూడో కుమారుడైన ఈయన అమెరికాలో అనేక ఆస్పత్రులను నిర్మించి అత్యుత్తమ వైద్యసేవలందించారు. దీన్ని గుర్తించిన ఆ దేశం.. అమెరికాలో ఓ వీధికి ఆయన పేరును పెట్టింది. కరోనా సమయంలోనూ అమెరికాలో విశేష సేవలు అందించి, పురస్కారాలు అందుకున్నారు. ఇక తన స్వగ్రామం అభివృద్ధికీ చేయూతనందించారు. తాను విద్యను అభ్యసించిన పాఠశాలకు రూ.14 లక్షలు విరాళం ఇచ్చారు. గ్రామంలోని సాయిబాబా మందిరం నిర్మాణానికి రూ.20 లక్షలను అందించారు. ఈనెల 15వ తేదీ నాయుడుపేటలోని తన సమీప బంధువుల వివాహవేడుకల్లో పాల్గొన్న రమేష్‌బాబు మృతి చెందాడని తెలియడంతో వారంతా దిగ్ర్భాంతికి గురయ్యారు. కాగా, రమేష్‌బాబు తల్లి రాజేశ్వరమ్మ తిరుపతిలో మరో కుమారుడు సురేష్ దగ్గర ఉంటోంది. కుమారుడి మరణవార్త విన్న వెంటనే రాజేశ్వరమ్మ, ఆమె కుటుంబీకులు అమెరికాకు బయల్దేరి వెళ్లారు.

పులిబోనుపల్లె వద్ద ఏనుగు మృతి


ఏనుగు కళేబరం

ఎర్రావారిపాలెం, ఆగస్టు 25: తలకోన అటవీ సరిహద్దు గ్రామం ఎర్రావారిపాలెం మండలంలోని పులిబోనుపల్లె వద్ద ఓ ఏనుగు మృతి చెందింది. సుమారు ఆరేళ్ల వయసున్న ఈ గజరాజు నాలుగు రోజుల కిందట చనిపోయినట్లు అటవీ అధికారులు ఆదివారం ఉదయం ఆలస్యంగా గుర్తించారు. తలకోన అటవీ ప్రాంతంలో వన్య ప్రాణుల వేట జోరుగా సాగుతోంది. 11 కేవీ లైను నుంచి కరెంటు తీసి, కొందరు వేటాడడం జరుగుతుంది. అయితే ఏనుగు అనారోగ్యంతో మరణించిందా లేక విద్యుతాఘాతమా అన్నది పోస్టుమార్టం నివేదిక వచ్చాక తెలియనుంది. ఈ ప్రాంతంలో ఇది రెండో సంఘటన. గతంలో నాటు బాంబు నమిలి గున్నఏనుగు మృతి చెందింది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 'గజ' మరణ ఘోష

- 14 ఏళ్లలో 46 మృతి

ఎర్రావారిపాలెం, ఆగస్టు 25: ఉమ్మడి చిత్తూరు జిల్లా అడవులో వన్యపాణులకు రక్షణ కరువైతున్నది. 14 ఏళ్లలో 46 ఏనుగు మృత్యువాత పడ్డాయి. కారణాలు ఏవైనా అరుదైన ఏనుగులు మృతి చెందడం జరుగుతూనే ఉండడంతో వన్యపాణి ప్రియులు ఆవేదన చెందుతున్నారు.

సంవత్సరాల వారీగా మరణాలు

- 2010లో ఎర్రావారిపాలెం చింతగుంట గ్రామం కృష్ణయ్య పొలంలో కరెంట్ షాక్‌తో ఒక ఏనుగు మృతి.
- 2011లో దేవరకొండ గ్రామం తిమ్మారెడ్డి మామిడితోపులో బావిలోపడి గర్భంతో ఉన్న ఆడ ఏనుగు మృతి.
- 2012లో సిద్దలగండి ప్రాజెక్టులో నీటి కోసం వెళ్లిన గున్నఏనుగు ఊబిలో దిగబడి మృతి.
- 2013లో కరెంట్ షాక్‌తో ఓ ఏనుగు మృతి. కుప్పంలో విద్యుత్ షాక్‌తో మూడు గజరాజులు మృత్యువాత పడ్డాయి.
- 2014 కౌండిన్య అభయారణ్యంలో అనారోగ్యంతో ఓ ఏనుగు మృతి.
- 2015లో పులిబోనుపల్లె వద్ద నాటు బాంబు నమిలి ఏనుగు దుర్మరణం. రామకుప్పం అడవిలో ఒకటి, ఎర్రావారిపాలెం సుబ్బరామాపురం వద్ద కరెంట్ షాక్‌తో మరో ఏనుగు మృతి.
- 2017లో ఎర్రావారిపాలెం కోటకాడపల్లె వద్ద విద్యుత్ షాక్‌తో ఏనుగు మృత్యువాత.
- 2018 రామకుప్పం శెట్టిపాలెం పొలాల్లో విద్యుత్ షాక్‌తో ఏనుగు మరణం.
- 2019లో ననియాల అడవులోని చెత్తపెంట వద్ద ఒకటి, పలమనేరు గొబ్బిళ్లటూరు వద్ద ట్రాన్స్‌ఫార్మర్ తగిలి మరో ఏనుగు మృతి. ఇదే ఏడాది ననియాల అడవులో ఆడ ఏనుగును మదపుటేనుగు గుద్ది చంపింది. కుప్పం ప్రాంతంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి ఒకటి మృతి. ఇదే ఏడాదిలోనే తమిళనాడు-ఆంధ్ర సరిహద్దులో రైల్వే ట్రాక్‌పై ఎనిమిది గజరాజుల మృతి. కోటకాడపల్లె వద్ద అనారోగ్యంతో ఒకటి, ఐరాల వద్ద రెండు ఏనుగులు కరెంట్ షాక్‌తో మృతి చెందగా.. రైతు గోతితీసి పూడ్చివేశారు. బంగారుపాళ్యం మండలం మొగిలివారిపల్లె వద్ద పొలంలో విద్యుత్ షాక్‌తో ఓ ఏనుగు మృతి.
- 2020లో చిత్తూరు సమీపంలోని గంగవరం వద్ద విద్యుత్ షాక్‌తో ఏనుగు మరణం.
- 2021లో పలమనేరు కోతిగుట్ట వద్ద ట్రాన్స్‌పారం ఢీకొని ఏనుగు మరణం, ఇదే మండలంలో విద్యుత్ షాక్‌తో ఒంటరి ఏనుగు మృతి. బంగారుపాలెం రాగిమానుపెంట వద్ద, సోమల మండలంలో విద్యుత్ వైర్లు నమలడంతో రెండు మృతి. కార్వేటినగరం మండలంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో ఓ ఏనుగు మృతి.
- 2022లో సదుం చెరుకువారిపల్లె వద్ద విద్యుత్ షాక్‌తో ఒకటి. మొగిలి ఘాట్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ తగిలి ఒకటి, బంగారుపాళ్యం మండలం చిట్టేరి మామిడితోపులో విద్యుత్ షాక్‌తో ఒకటి. టేకు మంద వద్ద స్తంభాన్ని ఢీకొనడంతో తీగలు తెగిపడి ఒకటి. మొగిలిపెంట వద్ద మామిడి చెట్లు విరిచే క్రమంలో విద్యుత్ తీగలు తగిలి ఒకటి. టేకుమంద కొణతలమిడుగు సమీపంలో పూలవానికుంట వంక వద్ద మామిడితోటలో విద్యుత్ తీగలు నమలడంతో గర్భంతో ఉన్న ఏనుగు మృతి.
- 2023లో మొగిలి ఘాట్ వద్ద మినీ లారీ ఢీకొని మూడు ఏనుగులు మృతి. భైరెడ్డిపల్లె నెల్లిపల్లి పంచాయతీ నల్లగుట్టపల్లె వద్ద తమిళనాడు నుంచి వచ్చి ఆరు ఏనుగుల మంద విద్యుత్ స్తంభం గుద్దడంతో వైరు పైనబడి ఒకటి మృతి.
- 2024లో ఎర్రావారిపాలెం పులిబోనుపల్లె వద్ద ఏనుగు మృత్యువాత పడింది.

చీపుర్లు చేతపట్టిన డాక్టర్లు



- స్విమ్స్‌లో వైద్యులను రోడ్డున పడేశారంటూ జూడాల వినూత్న నిరసన

తిరుపతి(వైద్యం), ఆగస్టు 25: స్విమ్స్‌లోని అత్యవసర విభాగంలో జూనియర్ డాక్టరుపై జరిగిన రోగి దాడిని ఖండిస్తూ జూనియర్ డాక్టర్లు (జూడాలు) చీపుర్లు చేతపట్టారు. స్విమ్స్ ఆవరణను శుభ్రం చేస్తూ ఆదివారం రాత్రి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈసందర్భంగా జూడాలు మాట్లాడుతూ.. స్విమ్స్‌లో వైద్యులను రోడ్డున పడేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా తమ న్యాయ పరమైన డిమాండ్లను పరిష్కరించకపోతే ఇలాంటి నిరసన కార్యక్రమాలను పెద్ద ఎత్తున కొనసాగిస్తామని తెలిపారు. ఇక టీటీడీ ఈవోతో సోమవారం జరిగే సమావేశంలో తమకు ఎంతవరకు న్యాయం జరుగుతుందో చూస్తామని.. ఆపై కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.


ఎస్వీ గెస్ట్‌హౌస్ వద్ద స్లాటెడ్ టోకెన్ల భక్తులు

తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

శ్రీవారి సర్వదర్శనానికి 20 గంటలు

తిరుమల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. శని, ఆదివారాలతోపాటు సోమవారం గోకులాష్టమి వంటి వరుస సెలవుల నేపథ్యంలో శనివారం రాత్రి నుంచే కొండకు వచ్చే భక్తుల రద్దీ పెరిగింది. శ్రీవారి మాడవీధులు, అఖిలాండం, లడ్డూ వితరణ కేంద్రం, అన్నప్రసాద భవనం, బస్టాండ్ వంటి ప్రాంతాలు భక్తులతో కిక్కిరిశాయి. సర్వదర్శనం భక్తులతో వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు నిండి క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వీరికి 20 గంటల దర్శన సమయం పడుతోంది. అలాగే గదుల కోసం భక్తులు సీఆర్వో వద్ద క్యూలో బారులు తీరారు. సిఫార్సుల లేఖలపై గదులు ఇచ్చే పద్మావతి, ఎంబీసీ24, టీబీ కౌంటర్లు కూడా కిటకిటలాడాయి. మరోవైపు తలనీలాలు సమర్పించే కల్యాణకట్టలు కూడా రద్దీగా దర్శనమిస్తున్నాయి. స్లాటెడ్ టోకెన్లు, టికెట్లు కలిగిన భక్తులతో ఎస్వీ గెస్ట్‌హౌస్ ప్రాంతం సందడిగా మారింది. ఇచ్చిన సమయానికంటే ముందుగానే వచ్చిన భక్తులు ఫుట్‌పాత్‌లపై సేదతీరుతూ కనిపించారు.


కృష్ణతేజ సర్కిల్ వద్ద సర్వదర్శన క్యూలైన్


ఎస్వీ గెస్ట్‌హౌస్ వద్ద ఫుట్‌పాత్‌పై సేదతీరుతున్న యాత్రికులు

అమ్మవారి ఆలయం వద్ద ఆక్టోపస్ మాక్‌డ్రిల్



తిరుచానూరు ఆలయం వద్ద మాక్‌డ్రిల్ చేస్తున్న ఆక్టోపస్ బృందాలు



తిరుచానూరు, ఆగస్టు 25: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో ఆదివారం తెల్లవారుజామును టీటీడీ విజిలెన్స్ సిబ్బంది, ఆక్టోపస్ దళం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాదులు చొరబడినపుడు ఏదైనా అత్యవసర పరిస్థితులు వాటిల్లినపుడు ఎలా ఎదుర్కోవాలి... భక్తులను ఎలా రక్షించాలి అనే విషయాలను మాక్‌డ్రిల్ ద్వారా చేసి చూపించారు. ఆక్టోపస్ దళాలు రాష్ట్రంలోని ప్రముఖ స్థలాలు, ఆలయాలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఏటా మాక్ డ్రిల్ నిర్వహించడం జరుగుతోంది. ఈ కార్యక్రమంలో వీజీవో నందకిషోర్, ఏవీఎస్వో సతీష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.87 కోట్లు

తిరుమల, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి):తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.87కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.3.87 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 79,521 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 40,152 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

త్వరగా భక్తులకు లడ్డూలు అందజేయండి

● అధికారులను ఆదేశించిన టీటీడీ అదనపు ఈవో

తిరుమల, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): భక్తులు రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో నిరీక్షణ సమయాన్ని తగ్గించి త్వరితగతిన లడ్డూలు అందజేయాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. తిరుమలలోని లడ్డూ కాంప్లెక్స్‌లో ఆయన ఆదివారం తనిఖీలు నిర్వహించారు. భక్తులు లడ్డూలు పొందే పద్ధతులను పరిశీలించి అధికారులు పలు సూచనలు చేశారు. అంతకు ముందు శ్రీవారి ఆలయ నాలుగు మాడవీధులను పరిశీలించారు. అక్టోబరు 4నుంచి బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఆలయ డిప్యూటీఈవో లోకనాథంతో కలిసి భక్తులు గ్యాలరీల్లో ప్రవేశించే, బయటకు వచ్చే మార్గాలను స్వయంగా చూశారు. ప్రత్యేకంగా గరుడసేవ రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. వీరితోపాటు వీఎస్వో సురేంద్ర, ఏవీఎస్వో మనోహర్ ఉన్నారు.

పద్మావతి అమ్మవారిసేవలో మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి



తిరుచానూరు, ఆగస్టు 25: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని ఆదివారం మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దొప్పాల వెంకటరమణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా జస్టిస్ వెంకటరమణ ఆలయ ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు వారికి వేదాశ్వీరచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

శక్తిపీఠంలో వైద్యశిబిరం



రామచంద్రాపురం, ఆగస్టు 25: రాయలచెరువుకట్ట వద్దనున్న శక్తి పీఠంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన వచ్చింది. శక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతి జ్యోతి ప్రజ్వలన చేసి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. 200మందికి వైద్యసేవలు అందించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు రోజారమణి, కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యానికేతన్ విద్యార్థులకు ఫొటోగ్రఫీపై మెలకువలు



తిరుపతి (ఎంఆర్‌పల్లె), ఆగస్టు 25: రంగంపేటలోని శ్రీవిద్యానికేతన్ విద్యార్థులకు వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ సిద్ధార్థ ఫొటోగ్రఫీపై మెలకువలు నేర్పించారు. ఆదివారం రంగంపేట పరిసర ప్రాంతాల్లో ఫొటోవాక్ నిర్వహించారు. తూనీగలు, సీతాకోక చిలుకలు, చిన్న చిన్న పురుగులను కెమెరాలో ఎలా బంధించాలో లైవ్‌గా నేర్చుకున్నారు.

బుల్లెట్ రమణకు పలువురి శుభాకాంక్షలు



తిరుపతి (ఎమ్మార్‌పల్లి), ఆగస్టు 25: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుల్లెట్ రమణ జన్మదినోత్సవం సందర్భంగా ఆదివారం పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద కేక్ కట్‌చేశారు. అనంతరం పంచముఖ ఆంజనేయ స్వామి గుడి సమీపంలో అన్నదానం చేశారు. రుయాలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అలిపిరి వద్ద మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు విశ్వనాథ్, రాజారాం, మహేష్, రాణెమ్మ, కల్పన, జయంతి, జుబేదా, కుమార్ యాదవ్, జగదీష్ రెడ్డి, కుప్పయ్య, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఎఫ్‌ఆర్టీఐ సభ్యత్వం పెంపునకు కృషి



సమావేశమైన ఎఫ్‌ఆర్టీఐ ప్రతినిధులు

తిరుపతి అర్బన్, ఆగస్టు 25: జిల్లాలో ఎఫ్‌ఆర్టీఐ మెంబర్‌షిప్ పెంచేందుకు కృషి చేయాలని నేషనల్ జాయింట్ సెక్రటరి అజయ్‌ప్రసన్నకుమార్ కోరారు. ఆదివారం స్థానిక జోనల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అజయ్‌ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ఎఫ్‌ఆర్టీఐ సంస్థ ద్వారా నాలుగు రాష్ట్రాల్లో చేస్తున్న కార్యక్రమాలను, హ్యూమన్‌రైట్స్, ఆర్టీఐ చట్టం మీద అవగాహన కార్యక్రమాలు, ప్రభుత్వ సంబంధిత సంస్థల నుంచి లీగల్‌గా న్యాయం పొందేందుకు సమాచార సేకరణ వంటి విషయాలను వివరించారు. ఈ సంస్థలో నాయకత్వాలు తీసుకొన్న వారంతా నిజాయితీగా సేవలందిస్తూ ఉత్సాహంగా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. అనంతరం ఇటీవల హర్యానాలో జరిగిన జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్ విభాగంలో బ్రాంజ్ మెడల్స్ సాధించిన జిల్లా క్రీడాకారులను సన్మానించి, అభినందించారు.

చంద్రగిరి

శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా..

● తిరుమలలో 8 ప్రథమ చికిత్స కేంద్రాలు

తిరుమల, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): రానున్న వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలలో ఎనిమిది ప్రథమ చికిత్స కేంద్రాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు జరుగనున్నాయి.ఈక్రమంలో భక్తులకు అసౌకర్యం లేకుండా టీటీడీ వైద్య విభాగం ఆధ్వర్యంలో నూతన చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇప్పటికే తిరుమల, తిరుపతిలో శాశ్వతంగా ఆరు డిస్పెన్సరీలు, ఆరు ప్రథమ చికిత్స కేంద్రాలలో భక్తులకు, ఉద్యోగులకు, స్థానికులకు టీటీడీ వైద్య సేవలు అందిస్తోంది. కాగా,బ్రహ్మోత్సవాల్లో భక్తుల సౌకర్యార్థం అదనంగా తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనాల్లో 2, రాంభగీచ అతిథిగృహాలు, వెంగమాంబ అన్నప్రసాద కేంద్రం, శిలాతోరణం, బాటగంగమ్మ ఆలయం,పాపవినాశనం, ఏడవ మైలు వద్ద ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేయనున్నారు.దీనికి కోసం టీటీడీ వైద్యవిభాగం ఆధ్వర్యంలో డాక్టర్లు,పారామెడికల్ సిబ్బంది, మందులు,అత్యాధునిక వైద్య పరికరాలతో కూడిన అంబులెన్స్‌లు సిద్ధం చేసుకుంటున్నారు.





ఎన్ఆర్ కమ్మపల్లిలో దుర్యోధన వధ ఘట్టం - ఎన్ఆర్ కమ్మపల్లిలో అగ్నిగుండ ప్రవేశం

అగ్నిగుండ ప్రవేశంతో ముగిసిన
మహాభారత ఉత్సవాలు

రామచంద్రాపురం, ఆగస్టు 25: మండలంలోని ఎన్ఆర్ కమ్మపల్లి, రామాపురంలలో 18 రోజులపాటు నిర్వహించిన మహాభారత ఉత్సవాలు ఆదివారం అగ్నిగుండ ప్రవేశంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో మూల మూర్తులకు తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. మధ్యాహ్నం ఆలయాల వద్ద దుర్యోధన మట్టి ప్రతిమ తయారు చేసి అలంకరించారు. అక్కడ భీమ వేష పాత్ర ధారులు వేణునాథం రెడ్డి, అశోక్, దుర్యోధన వేషపాత్రధారులు యుగంధర్, కిరణ్ మధ్య జరిగిన యుద్ధసన్నివేశాలు సభికులను ఆకట్టుకున్నాయి. సాయంత్రం ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఉత్సవమూర్తులను ఊరేగించి అగ్నిగుండం వద్ద కొలువుదీర్చారు. పూజారులు నిప్పుకణికలను ద్రౌపదీదేవి ఒడిలో కట్టి పూలబంతులు అగ్నిగుండంలో వేశారు. వందలాది మంది భక్తులు గోవిందనామ స్మరణల మధ్య అగ్నిగుండ ప్రవేశం చేశారు.



అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకు వస్తున్న పులివర్తి నాని

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన నాని

రామాపురం మహాభారత ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదివారం అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ నిర్వాహకులు నానికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, మాజీ ఎంపీపీ కేశవులునాయుడు, మబ్బుదేవనారాయణ రెడ్డి, జనార్దన చౌదరి, నరసింహా రెడ్డి, రామిరెడ్డి, ధనంజయరెడ్డి, గిరిధర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి ఉన్నారు.

వికసిత్ భారత్‌పై ఆన్‌లైన్‌లో చర్చాగోష్ఠి



తిరుపతి రూరల్, ఆగస్టు 25: తిరుపతికి చెందిన భారత గ్రామీణ అధ్యయనం, పరిశోధనా అకాడమీ(అగ్రశ్రీ)ఆధ్వర్యంలో భారతదేశంలో జనాభా పెరుగుదల-వికసిత్ భారత్ సాధనలో ఎదురవుతున్న సవాళ్లు అనే అంశంపై ఆదివారం ఆన్‌లైన్‌లో చర్చాగోష్ఠి నిర్వహించారు. ముఖ్యవక్తలుగా హాజరైన దూరదర్శన్ అదనపు మాజీ డైరెక్టర్ జనరల్ రేవూరి అనంతపద్మనాభరావు మాట్లాడుతూ వికేంద్రీకృత ప్రణాళిక, అమలుని ప్రోత్సహించడం, ప్రభుత్వ సంక్షేమపథకాలపై ప్రజలకు ఉన్న అపోహలు తొలగించడం, ఆర్థికవనరుల మధ్య సమతుల్యత పాటించడం ముఖ్యమైన అంశాలని స్పష్టం చేశారు. పూణెకి చెందిన అంతర్జాతీయ దీర్ఘాయువు కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ కె.శివరాజు మాట్లాడుతూ.. వృద్ధాప్య, బాల్య, యువత జనాభా, సీనియర్ సిటిజన్ల మెరుగైన శ్రేయస్సుకోసం ప్రభుత్వాలతో పాటు స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, మేధావులు కలసి పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎస్వీయూ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంఎస్ఆర్ మూర్తి మాట్లాడుతూ సామాజిక అభివృద్ధిలో యువత భాగస్వామ్యం, గ్రామీణ ప్రాంతాల్లో జనాభా నిష్పత్తి ప్రకారం ఆస్పత్రుల స్థాపన వంటి అంశాల పరిష్కారానికి జాతీయ ఆరోగ్య సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ముంబైకి చెందిన టాటా సాంఘికశాస్త్రాలసంస్థ ప్రొఫెసర్ డాక్టర్ పీఎం సంధ్యారాణి, వాయల్పాడు ఎస్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎం.రఘురామరెడ్డి, అగ్రశ్రీ సంచాలకుడు డి.సుందరరామ్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతభాష సేవలకు గుర్తింపుగా అవార్డుల ప్రదానం

● హయగ్రీవశర్మ, సూర్యనారాయణకి ప్రాచ్యవిద్యాభూషణ్‌తో సత్కారం



ప్రాచ్య విద్యాభూషణ్ అవార్డును అందుకుంటున్న ప్రొఫెసర్ హయగ్రీవశర్మ - ప్రొఫెసర్ సూర్యనారాయణభట్

తిరుపతి రూరల్, ఆగస్టు 25: న్యూఢిల్లీలోని లాల్‌బహదూర్ శాస్త్రి కేంద్రీయ సంస్కృతవర్సిటీలో నిర్వహించిన ఉత్కర్ష మహోత్సవంలో సంస్కృతక్షేత్రంలో విశేషసేవలందించిన ఇద్దరు ప్రొఫెసర్లకు తిరుపతిలోని జాతీయసంస్కృతి వర్సిటీ తరపున ప్రాచ్యవిద్యాభూషణ్ అవార్డులను అందజేసి సత్కరించారు. ఈమేరకు వర్సిటీ ఏపీఆర్వో డాక్టర్ కె.కుమార్ పేర్కొన్నారు. కేంద్రీయవర్సిటీ హోదా ఉన్న తిరుపతికి చెందిన జాతీయ సంస్కృత వర్సిటీ, న్యూఢిల్లీకి చెందిన సెంట్రల్ సాంస్క్రీట్, లాల్‌బహదూర్‌వర్సిటీల సంయుక్త ఆధ్వర్యంలో న్యూఢిల్లీ వేదికగా నిర్వహించిన ఈ ఉత్కర్ష మహోత్సవంలో సంస్కృత భాషాభివృద్ధికి సేవలందించిన ఇద్దరికి ప్రతిఏటా వర్సిటీ తరపున అవార్డులతో పాటు రూ.లక్ష నగదుని ఇవ్వాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా తిరుపతిలోని ఎన్ఎస్‌యూ తరఫున ఈఏడాదికి ఎస్వీయూకి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ హయగ్రీవశర్మ, కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్ సంస్కృతవర్సిటీలో పనిచేసిన ప్రొఫెసర్ సూర్యనారాయణ భట్‌లను నామినేట్ చేసి అవార్డులతోపాటు రూ.లక్ష నగదుని ప్రదానం చేశారని పేర్కొన్నారు. వీసీ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. సంస్కృత భాషకోసం కృషి చేస్తున్న వారిని ప్రతిఏటా ఉత్కర్ష మహోత్సవంలో సత్కరించి, వారి ద్వారా సంస్కృత భాషాభివృద్ధికి మరిన్ని ప్రణాళికలు తయారుచేసి సంస్కృతాన్ని జనభాషగా.. విశ్వభాషగా చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

అలిపిరి చెక్‌పాయింట్‌లో తనిఖీలు



అలిపిరి చెక్‌పాయింట్‌లో తనిఖీలు చేస్తున్న తిరుమల డీఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 25: త్వరలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో పోలీసులు, టీటీడీ విజిలెన్సు అధికారులు అన్ని తనిఖీ కేంద్రాల్లో నిఘా పటిష్ఠం చేస్తున్నారు. ఇందులో భాగంగా తిరుమల డీఎస్పీ విజయశేఖర్, విజిలెన్సు, ఎస్పీఎఫ్ సిబ్బంది సంయుక్తంగా ఆదివారం ఉదయం అలిపిరి చెక్‌పాయింట్ వద్ద ముమ్మరంగా తనిఖీలు చేశారు. వాహనాలను ఎలా తనిఖీ చేసి పంపుతున్నారు? మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేయడానికి ఎంత సమయం పడుతోంది? సీసీ కెమెరాలు, లగేజీ స్కానర్ల పనితీరుపై లోతుగా సమీక్షించి ప్రతి వాహనాన్ని తప్పనిసరిగా తనిఖీ చేసి కొండకు అనుమతించాలని డీఎస్పీ విజయశేఖర్ ఆదేశించారు. టీటీడీ ఈవో శ్యామలరావు, ఎస్పీ సుబ్బరాయుడు, విజిలెన్సు చీఫ్ శ్రీధర్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు తరచూ జరుగుతుంటాయన్నారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ చెప్పారు. అనంతరం కమాండ్ కంట్రోలు పనితీరును పరిశీలించారు. అలిపిరి చెక్‌పాయింట్ ఏవీఎస్‌వో రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు..

సీవీఎస్‌వో ఆదేశాల మేరకు తనిఖీలు
- ఏవీఎస్‌వో రాజశేఖర్ -

టీటీడీ ముఖ్య నిఘా భద్రతాధికారి శ్రీధర్ ఆదేశాల మేరకు పోలీసు, విజిలెన్సు విభాగాలు కలసి సంయుక్తంగా తనిఖీలు చేస్తున్నాం. ప్రస్తుతం అలిపిరి చెక్‌పాయింట్‌లో వున్న 100 సీసీకెమెరాలు, ఆరు లగేజీ స్కానర్ల పనితీరును తిరుమల డీఎస్పీ పరిశీలించారు. వాహనాలు, లగేజీ తనిఖీలు ఆలస్యం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేస్తున్నారు. చెక్‌పాయింట్ నుంచి నిషేధిత వస్తువులను తీసుకెళ్లడం వంటి చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

గూడూరు సబ్‌కలెక్టర్‌గా రాఘువేంద్ర మీనా

గూడూరు అర్బన్, ఆగస్టు 25: గూడూరు సబ్ కలెక్టరుగా రాఘవేంద్రమీనాను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులను జారీ చేసింది. ఇక్కడ ఆర్డీవోగా పనిచేస్తున్న కిరణ్‌కుమార్‌ను బదిలీ చేసింది. ఆయన స్థానంలో 2022 బ్యాచ్ ఐఏఎస్ అధికారి రాఘవేంద్రమీనాను సబ్ కలెక్టర్‌గా నియమించారు. ట్రైనీ కలెక్టర్‌గా శిక్షణ ముగించుకున్న ఈయనకు తొలి పోస్టింగ్ ఇది.

ఇద్దరు టీచర్లకు తెలుగు వైభవ పురస్కారాలు

ఎర్రావారిపాలెం, ఆగస్టు 25 : మండలంలోని ఇద్దరు ఉపాధ్యాయులు జాతీయ తెలుగు వైభవ పురస్కారం అందుకున్నారు. ఈనెల 29న మాతృభాష దినోత్సవం సందర్భంగా చిత్తూరులో జరిగిన అవార్డుల ప్రదానంలో పచ్చారవాండ్లపల్లె, మేదరపల్లె ప్రాథమిక పాఠశాలల టీచర్లు మల్లెల సిద్ధయ్య, అంజిమేటి మలేశ్వర్‌లకు తెలంగాణ ఎమ్మెల్సీ కవి, రచయిత గోరేటి వెంకన్న, సినీగేయ రచయిత చిన్నికృష్ణలు పురస్కారాలు ప్రదానం చేశారు.

ఎస్టీ వర్గీకరణ కోసం ఉద్యమిద్దాం

తిరుపతి అర్బన్, ఆగస్టు 25: ఎస్టీ వర్గీకరణ కోసం ఉద్యమాలకు సన్నద్ధమవుదామని యానాది సంఘం రాష్ట్ర నాయకులు కె.సి.పెంచలయ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక బాబుజగ్జీవన్‌రామ్‌భవన్‌లో యానాది సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి యానాది సంఘాల నాయకులు హాజరయ్యారు. పెంచలయ్య మాట్లాడుతూ వచ్చేనెల 15న విజయవాడలో నిర్వహించే సమావేశంలో ఉద్యమ కార్యచరణ ప్రకటించనున్నారని, ఉద్యమానికి సిద్ధమయ్యేలా యానాది కాలనీల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వం యానాదులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యానాది సంఘాల నాయకులు వెంకటపతి, తిరుమలశెట్టి శ్రీనివాసులు, రామయ్య, రామచంద్రయ్య, సరస్వతమ్మ, ఉష, రమ్య తదితరులు పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న యానాది సంఘం సభ్యులు

గురుకులంలో విద్యార్థి అదృశ్యం



లోకేష్

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 25: బుచ్చినాయుడు కండ్రిగ మండలం కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య గురుకుల పాఠశాల నుంచి ఓ విద్యార్థి అదృశ్యం అయ్యాడు. గురుకులంలో పదవ తరగతి చదువుతున్న లోకేష్, శ్రీహరి శుక్రవారం రాత్రి గోడ దూకి బయటకు పోతుండగా ఉపాధ్యాయులు పట్టుకుని మందలించారు. శనివారం ఉదయం ప్రార్థన సమయంలో శ్రీహరి మాత్రమే హాజరయ్యాడు. లోకేష్ అదృశ్యమైనట్లు గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. లోకేష్ తండ్రి బాలు నాయక్, ప్రిన్సిపాల్ ఆది వారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ విశ్వనాథ నాయుడు కేసు నమోదు చేసి విద్యార్థి కోసం గాలింపు చేపట్టారు. కాగా, విద్యార్థి లోకేష్ స్వస్థలం కర్నూలు జిల్లా తుగ్గలి మండలం గుండాల తాండా.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య



ధనంజయులు (ఫైల్‌ఫొటో)

కేవీబీపురం, ఆగస్టు 25: మండలం లోని ఆరె పంచాయతీ రాళ్లమిట్ట గ్రామానికి చెందిన ధనంజయులు (31) నాలుగు రోజుల క్రితం కుటుం బ కలహాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గుర్తించిన బంధువులు వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. అతడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ లోకనాథం తెలిపారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

సూళ్లూరుపేట, ఆగస్టు 25: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో చెన్నై వైపు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు. మృతుని జేబులో సూళ్లూరుపేట నుంచి చెన్నైకి టికెట్ కనిపించింది. ఎటువంటి ఆధారాలు లేవు. కాఫీ రంగు గడుల చొక్కా, నలుపు రంగు జీన్స్ ధరించి ఉన్నాడు. 45 నుంచి 50 సంవత్సరాలుంటాయి. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా ధ్వజారోహణం



రామచంద్రాపురం, ఆగస్టు 25: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా గోవర్ధనగిరి చిన్మయ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 8.45గంటలకు కన్యాలగ్నంలో వేదపండితులు శాస్త్రోక్తంగా ధ్వజారోహణ నిర్వహించారు. ఈ సందర్భంగా రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు ఊంజల్‌సేవ నిర్వహించి పుష్పపల్లకిలో ఊరేగించారు. చిన్మయమిషన్ కార్యదర్శి సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

బ్లూమింగ్ బడ్స్‌లో కృష్ణాష్టమి వేడుకలు



వేషధారణలో విద్యార్థుల కోలాటాలు ఆడుతున్న దృశ్యం

చంద్రగిరి, ఆగస్టు 25: చంద్రగిరిలోని బ్లూమింగ్ బడ్స్ స్కూల్లో ఆదివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జరిగాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులు రాధ, కృష్ణుడు,కంసుడు పాత్రల వేషధారణలతో చూపరులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ ఛైర్మన్ హితేంద్రనాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

చంద్రగిరి, ఆగస్టు 25: చంద్రగిరి మండలం ఐతేపల్లె సమీపంలో ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు ఐతేపల్లె సమీపంలో నడుచుకొంటూ వెళుతున్న ఓ వ్యక్తిని కారు ఢీ కొంది. దీంతో డ్రైవర్ కారు ఆపి పరారయ్యాడు. ఈ ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడిపై పలు వాహనాలు దూసుకుపోవడంతో మృతదేహం గుర్తు పట్టలేని విధంగా నుజ్జునుజ్జు అయింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించారు. మృతుడికి 30 సంవత్సరాలు వయసు ఉంటుందని, అతడి జేబులో ఈనెల 22న తిరుమల అశ్విని హాస్పిటల్లో చికిత్స పొందినట్లు ఓపీ ఉంటడంతో మృతుడు అన్నదాసుగా ఉంటారని తెలిపారు. మృతుడు బ్లాక్ ప్యాంట్, బ్రౌన్ కలర్ షర్టు ధరించి ఉన్నాడని, వివరాలకు 9440796760 నంబరులో సంప్రదించాలన్నారు.

కృష్ణాపురంలో రేణుకాపరమేశ్వరి జాతర



చంద్రగిరి, ఆగస్టు 25: ఎ.రంగంపేట పంచాయతీ కృష్ణాపురంలో మాతమ్మ రేణుకా పరమేశ్వరి జాతర నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం అమ్మవారికి ముగ్గు వేయడం, నడివీధి గంగమ్మకు అంబళ్ళు పోశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులు దగ్గుపాగు వెంకటరమణ, మాతయ్య, సిద్దయ్య, మునిరత్నం, మహేంద్ర, మొగిలీశ్వర్‌రావు, వెంకటేష్, శ్రీనివాసులు, నీలకంఠేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో ఆకట్టుకున్న సామాజిక ప్రదర్శన



తిరుచానూరు, ఆగస్టు 25: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు స్టూడెంట్ నేషన్ వలంటీర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన హర్‌ఘర్ తిరంగ్ పిలుపు మేరకు అన్నమాచార్య కళాశాల విద్యార్థులు సామాజిక ప్రదర్శన చేపట్టారు. దేశంలో స్త్రీ జాతి సంరక్షణకు సమాజంలో ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని, మహిళలు ఆత్మరక్షణ కోసం ఎదుర్కోవాల్సిన పరిస్థితుల గురించి అవగాహన కల్పించారు.

అబ్బురపరచిన నృత్య ప్రదర్శన



తిరుచానూరు, ఆగస్టు 25 : తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం చిన్నారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన అలరించింది. ధవళేశ్వరానికి చెందిన నర్తన నటరాజ నాట్యాలయ విద్యార్థులు నృత్య ప్రదర్శన చేశారు. కళాకారులు నవ్యవ, కావ్య, సహస్ర, కౌశిక, శ్రీకరి, అక్షయ్య తదితరులు నర్తన గణపతి, ఇదిగో భద్రాద్రి, కథిరి నరశింహుడు, ధనశ్రీ తిల్లానా, తరంగం వంటి కీర్తనలకు నృత్యం చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోట, ఆగస్టు 25 : మండల పరిధిలోని చిట్టేడు వద్ద ఆదివారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు లేకుండా రుద్రవరం, ఊనుగుంటపాళెం, స్వర్ణముఖినది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

నాపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు
టీడీపీ నాయకుడు జయచంద్రారెడ్డి

చంద్రగిరి, ఆగస్టు 25: వైసీపీ నాయకులు తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని అగరాలకు చెందిన టీడీపీ నాయకుడు జయచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తమ గ్రామానికి చెందిన సురేష్, భవితలను వాళ్ళ బంధువైన చంద్రమ్మ ఆస్తి, ఇళ్ళు ఇవ్వకుండా తరిమేస్తే వారికి తాను ఆసరా కల్పించినట్లు తెలిపారు. తొమ్మిదేళ్లుగా తనింట్లోనే ఉన్నారని, ప్లాటు కొనడానికి తనవద్ద తీసుకున్న అప్పును తిరిగి చెల్లించమన్నందుకు వారిని వైసీపీ నాయకులు రెచ్చగొట్టి పోలీసులకు ఫిర్యాదు చేయమని ప్రోత్సహించారన్నారు. పోలీస్‌స్టేషన్‌లో పంచాయితీ జరుగుతుండగా వాదోపవాదాలు జరిగాయే తప్ప వారిపై దాడి చేయలేదని తెలిపారు.

మిలటరీస్కూల్స్ ప్రవేశపరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), ఆగస్టు 25: జాతీయస్థాయిలో 2025-26 విద్యాసంవత్సరానికి రాష్ట్రీయ మిలటరీస్కూల్స్‌లో 6, 9 తరగతుల్లో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశపరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం పోటీపరీక్షల ఉచిత సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. ఈపరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు వయసు ఆధారంగా 5 నుంచి 9 తరగతులు చదివే బాల, బాలికలకు అవకాశం ఉందని, వచ్చేనెల 19వ తేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందని తెలిపారు. ప్రవేశపరీక్షా విధానం, దరఖాస్తు వంటి ఇతర వివరాలకోసం తిరుపతిలో వరదరాజనగర్‌లోని విశ్వంస్కూల్‌లోగానీ లేదా 86888 88802/ 93999 76999 ఫోన్ నెంబర్లని సంప్రదించాలని కోరారు. కాగా జాతీయస్థాయిలో నిర్వహించే పలు పోటీపరీక్షలకు దరఖాస్తు గడువుతేదీ, విద్యార్హత వంటి వివరాలు ఈవిధంగా ఉన్నాయి.

కోర్సు	ప్రవేశం	దరఖాస్తుకు చివరితేదీ
నవోదయ	6వతరగతి	16-09-2024
ఆర్ఐఎంసీ	8వతరగతి	30-09-2024
మిలటరీస్కూల్స్	6 నుంచి 9తరగతులు	19-09-2024

మహిళలను లక్షాధికారులను చేసేందుకే లక్‌పతి దీదీ : కలెక్టర్



స్వయం సహాయక సభ్యురాలికి సర్టిఫికెట్‌ను అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్సీ

తిరుపతి(విద్య), ఆగస్టు 25: స్వయం సహాయ సంఘాల్లోని మహిళలందరినీ లక్షాధికారులను చేయడమే లక్ష్యంగా ప్రధాని మోదీ లక్‌పతి దీదీ పథకాన్ని ప్రారంభించారని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న లక్‌పతి దీదీ పథకాన్ని ప్రధాని మోదీ ఆదివారం ప్రారంభించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఈ కార్యక్రమానికి కలెక్టర్, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఈ పథకాన్ని ఉపయోగించుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ కార్యక్రమాలను స్వయం సహాయక సంఘాల మహిళలు సద్వినియోగించుకుంటే లక్షాధికారులు అవుతారన్నారు. సంవత్సరానికి రూ.లక్ష ఆదాయం దాటే మహిళా సంఘాలకు సర్టిఫికెట్లు, రుణాల పంపిణీ చెక్కును కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ ప్రభావతి, ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి, డీఆర్డీఏ డీపీ ఎం మాధవి, స్వయం సహాయక సభ్యులు పాల్గొన్నారు.

ఆస్టర్ నారాయణాద్రిలో రోబోటిక్ సర్జరీలు


రోబోటిక్ సర్జరీలు చేస్తున్న దృశ్యం

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 25: తిరుపతిలో మొట్టమొదటిసారిగా ఆదివారం ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రిలో రోబోటిక్ నీ రీప్లేస్‌మెంట్ ఆపరేషన్లు నిర్వహించినట్లు డాక్టర్ సునందకుమార్‌రెడ్డి వెల్లడించారు. ఆస్పత్రిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఎవరికైనా ఇంతకుముందు టీకేఆర్ ఆపరేషన్ జరిగి చీము పట్టి కానీ, పరికరాలు వదులై ఆపరేషన్ విఫలమైన వారికి కూడా రివిజన్ టీకేఆర్ ఆపరేషన్లు ఇక్కడ చేస్తున్నామని తెలిపారు. ఇలాంటి సమస్యలతో బాధపడేవారు ఆస్టర్ నారాయణాద్రిలో సేవలు ఉపయోగించుకోవచ్చని చెప్పారు. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శ్రీధర్‌ముని మాట్లాడుతూ తమ ఆస్పత్రిలో సంక్లిష్టమైన, అరుదైన సర్జరీలు చేసేందుకు నైపుణ్యం కలిగిన వైద్యులు ఉన్నారని తెలిపారు.

అలనాటి విద్యార్థుల అపూర్వ కలయిక



నవాబుపేట మున్సిపల్ అప్పర్ ప్రైమరీ స్కూల్ పూర్వవిద్యార్థులు

తిరుపతి(విద్య), ఆగస్టు 25: తిరుపతి నవాబుపేటలోని మున్సిపల్ అప్పర్ ప్రైమరీ స్కూల్ 1991-92 సంవత్సరంలో 7వ తరగతి చదివిన విద్యార్థులు 33 సంవత్సరాల తరువాత అదే పాఠశాలలో ఆదివారం కలిశారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఊసులు చెప్పుకున్నారు. నాటి తమ ఉపాధ్యాయులను కూడా ఆహ్వానించి, వారి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించి గురు భక్తిని చాటుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. ఉపాధ్యాయులు గంగయ్య, బాలమ్మ, శ్రీదేవి, ద్రాక్షాయణి, లక్ష్మి, స్కూల్ ఇంచార్జి అనిల్‌కుమార్, పూర్వ విద్యార్థులు దేవీప్రసాద్, హసీనా, సంతోష్, కామరూన్ బేగం, భారతి, కృష్ణవేణి, ధరణి పాల్గొన్నారు.

30న కపిలేశ్వరాలయంలో లక్ష కుంకుమార్చన

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 25: తిరుపతి కపిలేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 30వ తేదీన కామాక్షి అమ్మవారికి లక్ష కుంకుమార్చన జరుగనుంది. ఇందులో భాగంగా ఉదయం 6 గంటలనుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గణపతి పూజ, లక్ష కుంకుమార్చన జరుగుతుంది. అనంతరం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామి అమ్మవార్లకు తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు


క్రికెటర్ ఉమేష్ యాదవ్ - రామజోగయ్య శాస్త్రి

తిరుమల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో.. ఇండియన్ క్రికెటర్ ఉమేష్ యాదవ్, సినీ గేయ రచయిత రామజోగయ్య శాస్త్రి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

వరసిద్ధుడి ఆలయంలో రేపు శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 25: కాణిపాక ఆలయంలో మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఈవో వాణి తెలిపారు. గోశాలలో గోవులకు పూజ నిర్వహిస్తామని, ఉభయదారులు, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 31న బెంగళూరుకు చెందిన వైదేహి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆస్థాన మండపంలో నిర్వహించే వైద్య శిబిరాన్ని అవసరమున్న వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చైన్ స్నాచర్ అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 25: తిరుపతిలోని పలు ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తిని ఎంఆర్‌పల్లి పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. గుంటూరుకు చెందిన గరిక సుబ్బరాజు తిరుపతి కేంద్రంగా అలిపిరి, తిరుచానూరు, తుమ్మలగుంట ప్రాంతాల్లో మహిళల మెడనుంచి చైన్ స్నాచింగ్‌లకు పాల్పడేవాడు. దీనిపై అందిన ఫిర్యాదుల మేరకు ఎంఆర్‌పల్లి ఎస్ఐ షేక్షావలి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న తరుణంలో ఆదివారం ఆర్‌సీ పురం సర్కిల్ వద్ద తిరుగుతున్న నిందితుడిని పట్టుకుని అరెస్టు చేశారు. చైన్ స్నాచింగ్‌కు గురైన బంగారు నగలను త్వరలో రికవరీ చేసి బాధితులకు అప్పగించనున్నట్లు ఎస్ఐ చెప్పారు.

నేటినుంచి జాతీయ క్రీడాదినోత్సవ ప్రత్యేక పోటీలు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 25: ప్రపంచ ప్రఖ్యాత హాకీ క్రీడాకారుడు, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని సోమవారం నుంచి 31వ తేదీ వరకు జాతీయ క్రీడాదినోత్సవ ప్రత్యేక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే క్విజ్, వ్యాసరచన పోటీలు కూడా నిర్వహిస్తామన్నారు. అంతర్ పాఠశాలలు, కళాశాలలతో పాటు జిల్లా స్థాయిలో వాకోరేసు, వాలీబాల్, హాకీ, మినీఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, చెస్, జూడో, బాక్సింగ్, యోగా తదితర క్రీడాంశాలలో పోటీలు జరుగుతాయన్నారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చంద్రగిరి పోలీసులపై చర్యలు తీసుకోండి

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 25: చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో సీఐ ఎదుట అధికార పార్టీ నాయకుడు రజక మహిళపై చెప్పుతో దాడి చేసినా స్పందించక పోవడాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. స్పందించని పోలీసులు, పోలీసు అధికారులపై జిల్లా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.


శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఇస్కాన్ టెంపుల్ వద్ద ఏర్పాటు చేసిన స్వాగతద్వారం - భక్తుల కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్ - భజన చేస్తున్న భక్తులు - విద్యుద్దీపాలతో ఏర్పాటు చేసిన కటౌట్

శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలకు తిరుపతిలో ట్రాఫిక్ మళ్లింపు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 25: తిరుపతి ఇస్కాన్ టెంపుల్‌లో మూడు రోజుల పాటు జరుగనున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలకు పోలీసు శాఖ తరపున అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు చెప్పారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని నగరంలో పలు చోట్ల ట్రాఫిక్‌ను మళ్లించామన్నారు. ఈ వేడుకల్లో భక్తులు, వీఐపీలు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొంటారన్నారు. ఇస్కాన్ టెంపుల్ అలిపిరి లింక్ బస్టాండుకు ఆగ్నేయం వైపున, ఉత్తరం, తూర్పున టీటీడీ ఉద్యోగుల క్వార్టర్స్ ఉన్నాయన్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, జేబుదొంగలు, చైన్ స్నాచింగ్‌లు, మొబైల్ ఫోన్ల దొంగతనాలు జరిగే అవకాశాలు ఉంటాయన్నారు. ఉత్సవాలు శాంతి యుతంగా, ఆలయ ప్రాంగణంలో ప్రశాంతవాతావరణం నెలకొల్పడానికి పలు జంక్షన్ల వద్ద ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు ఎస్పీ చెప్పారు.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా.....

ఇస్కాన్‌కు వచ్చే భక్తులు తమ వాహనాలను అలిపిరి లింక్ బస్టాండు పార్కింగ్ స్థలంలో ఉంచాలి. అన్నారావు సర్కిల్ రోడ్డు నుంచి వచ్చే ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను బాలాజీ లింక్ బస్టాండులోనే ఆపి అక్కడ నుంచి నడచుకుంటూ ఆలయం వద్దకు చేరుకోవాలి. ఎస్పీ ఆదేశాల మేరకు ట్రాఫిక్, క్రైం శాంతి భద్రతలకు సంబంధించిన 250 మంది పోలీసులను బందోబస్తు నిమిత్తం నియమించినట్లు నగర డీఎస్పీ వెంకటనారాయణ తెలిపారు.

రామకృష్ణ ఆశ్రమంలో

తిరుపతి(కల్చరల్): వినాయకనగర్‌లోని రామకృష్ణ ఆశ్రమంలో కూడా సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు భగవద్గీత పారాయణం, సాయంత్రం 4 గంటల నుంచి స్వామి విశ్వరాజానంద ఆధ్వర్యంలో భజనలు జరుగుతాయి. అనంతరం స్వామి సత్వస్థానందచే శ్యామనామ సంకీర్తనం ఉంటుంది. 6.30 గంటలకు ఆరాత్రికం, రాత్రి 7 గంటలకు శ్రీకృష్ణ అష్టోత్తర శతనామావళి, అర్చన జరుగుతాయి. 7.30 గంటలకు శ్రీకృష్ణాష్టమి ప్రత్యేక పూజ ఉంటుంది.

19మంది 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

మూడు కార్లు, గొడ్డళ్లు, రంపాల స్వాధీనం


పట్టుబడ్డ స్మగ్లర్లతో టాస్క్‌ఫోర్సు సిబ్బంది

మంగళం, ఆగస్టు 25: నాగపట్ల అటవీ ప్రాంతంలోకి చొరబడుతున్న 19మంది ఎర్ర చందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డికి చెందిన కేఏస్కే. లింగాధర్ టీమ్ ఆదివారం కూంబింగ్ నిర్వహించారు. ఈ బృందం భాకరాపేట చేరి, అక్కడి నుంచి శ్రీవారిమెట్టు వైపు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను తనిఖీ చేసుకుంటూ వెళతోంది. చంద్రగిరి మండలం నాగపట్ల అటవీ ప్రాంతంలోని నరసింగాపురం రైల్వే గేటు సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిషేధిత అటవీ ప్రాంతంలో మూడు కార్లు కనిపించాయి. వాహనాలను చుట్టుముట్టగా అందులోని వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని పట్టుకుని విచారించగా, ఎర్ర చందనం కోసం అడవిలోకి వెళుతున్నట్లు తేలింది. దీంతో వారిని అరెస్టు చేశారు. వీరిలో తిరుపతి సత్యనారాయణపురానికి చెందిన ఎన్సీ శివ (45), డి.జానకిరామ్ (36), రైల్వే కోడూరుకు చెందిన నాయని శివ (36), తోట లక్ష్మీపతి (30), కార్వేటినగరానికి చెందిన ప్రభాకర్ (45), తమిళనాడు తిరువణ్ణామలై జిల్లాకు చెందిన దక్షిణామూర్తి (29), సిన రాజా (49), కుమార్ చిన్నపయ్యన్ (35), తిరుపత్తూరు జిల్లాకు చెందిన రామలింగ రాజు (54), పార్తిబన్ కుమార్ (24), స్వామినాథన్ అన్నామలై (38), వాసుమణి (23), ఆర్ రవి (40), ఎ.అన్నామలై (35), కార్తీక్ (42), సేతుమణి (26), శంకర్ (44), కుమార్ రాజా (44), కార్తీక్ (25)లుగా గుర్తించారు. వీరి వద్ద నుంచి మూడు కార్లు, నాలుగు పిడిలేని ఇనుప గొడ్డళ్లు, ఓ ఇనుప బరిసె, నాలుగు ఇనుప రంపాలను స్వాధీనం చేసుకున్నారు. వీరిని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించి, సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా బీపీ మండల్ జయంతి


నివాళి అర్పిస్తున్న మేయర్, ఎమ్మెల్సీ, బీసీ నాయకులు, ఆపస్ నాయకులు, బీజేపీ నాయకులు

తిరుపతి(విద్య), ఆగస్టు 25: ఓబీసీ రిజర్వేషన్ల పితామహుడు బిందేశ్వర ప్రసాద్ మండల్ జయంతి కార్యక్రమాన్ని తిరుపతి నగరంలో ఆదివారం పలు సంఘాలు ఘనంగా నిర్వహించాయి. స్థానిక డీబీఆర్ హాస్పిటల్ రోడ్డులోని మండల్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.

- బీజేపీ ఆధ్వర్యంలో బీపీ మండల్‌కు పుష్పాంజలి ఘటించారు. పార్టీ నాయకులు సుబ్రహ్మణ్యయాదవ్, మల్లకుప్పం శేఖర్, సుబ్బయాదవ్, గుండాల గోపీనాథ్‌రెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, ఫణిభూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు బీపీ మండల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆపస్ జిల్లా అధ్యక్షుడు తూకివాకం నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు సాంబిరెడ్డి, జిల్లా సహాధ్యక్షులు డాక్టర్ మొర్రిపేకల దేవరాజులు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి అర్బన్: బీసీ రిజర్వేషన్ పితామహుడు బీపీ మండల్ అని నగర మేయర్ డాక్టర్ శిరీష కొనియాడారు. డీబీఆర్ రోడ్డులోని ఆయన విగ్రహానికి మేయర్‌తో పాటు, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, బీసీ నేతలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బీసీ సంరక్షణ సమితి గౌరవాధ్యక్షులు బుసగాని లక్ష్మయ్య, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి శ్రీనివాసులయాదవ్, కార్పొరేటర్లు నారాయణ, అనిత, అక్కినపల్లి లక్ష్మయ్య, సాకం ప్రభాకర్, అశోక్‌సామ్రాట్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల కోసం వేట

- కేరళ, బెంగళూరు, చెన్నై వాసులుగా అనుమానం
- ప్రత్యేక బృందాల గాలింపు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 25: తిరుపతి ఎంఆర్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని రామానుజపల్లి చెక్‌పోస్టు వద్ద శుక్రవారం పోలీసులకు వాహనాల తనిఖీలో పట్టుబడిన రూ.50 లక్షల లిక్విడ్ గంజాయి, కేరళ రిజిస్ట్రేషన్ వున్న కారు ఆధారంగా గంజాయిని సరఫరా చేసే వారు అంతర్ రాష్ట్ర ముఠాగా పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు కనపడిన వెంటనే కారుతో సహా గంజాయి బ్యాగులను వదలి పరారైన ముగ్గురి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. చంద్రగిరి డీఎస్పీ నరసింగప్ప నేతృత్వంలో సీఐ షాదిక్ ఆలి పర్యవేక్షణలో దాదాపు 10 మంది పోలీసులు వీరికోసం గాలిస్తున్నారు. కారు కేరళ రిజిస్ట్రేషన్ కలిగి ఉండటంతో కేరళకు చెందిన ముఠానే గంజాయి సరఫరా చేస్తోందని పోలీసులు అనుమానం వ్యక్తపరుస్తున్నారు. కారు రిజిస్ట్రేషన్ ఎవరి పేరున వుంది? గంజాయి ముఠాకు కారు ఎవరైనా ఇచ్చారా లేకుంటే వారే స్వయంగా తీసుకొచ్చారా అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. ఇప్పటికే గంజాయి ముఠా ఎవ్వరనే విషయం పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ఇదిలా వుండగా అంతర్ రాష్ట్ర గంజాయి ముఠా కోసం బెంగళూరు, చెన్నై, కేరళకు ప్రత్యేక పోలీసు బృందాలు వెళ్లినట్లు సమాచారం.

ఆర్యవైశ్యుల్లో సేవాతత్పరత అధికం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి అర్బన్, ఆగస్టు 25: ఆర్యవైశ్యుల్లో సేవాతత్పరత అధికమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. వాసవి ఆర్యవైశ్య సేవా సమాజం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక టీటీడీ పద్మావతి కల్యాణ మండపంలో ఆర్య వైశ్య వృద్ధ దంపతులకు 14వ సామూహిక కనకాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్లలో కనకాభిషేకం నిర్వహించుకోలేని వారికోసం సామూహికంగా 108మంది దంపతులకు ఈ కార్యక్రమం చేయడం ముదావహమన్నారు. వాసవి ఆర్యవైశ్య సేవా సమాజం అధ్యక్షులు దిండుకుర్తి నరసింహులు, గౌరవ అధ్యక్షులు సుబ్బరాజు, కార్యదర్శి నరసింహారావు, పామిడి రామమూర్తి, ఊకా వెంకటేష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ

నూతన అదనపు ఎస్పీ నాగభూషణరావు



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 25: జిల్లాలో అసాంఘిక శక్తులు, బహిరంగ ప్రాంతాల్లో మద్యం సేవించడం, ఇసుక అక్రమ రవాణా, గంజాయి విక్రయాలు, వినియోగంపై ఉక్కుపాదం మోపుతామని శాంతి భద్రతల అదనపు ఎస్పీ నాగభూషణరావు హెచ్చరించారు. రెండ్రోజుల క్రితం అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎస్పీ సుబ్బరాయుడి ఆదేశాల మేరకు రానున్న 100 రోజుల్లో నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. కొత్త చట్టాల అమలు, సైబర్ నేరాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. పోలీసులు చట్టాలకు లోబడి పనిచేయాలని, సివిల్, భూ వివాదాల సెటిల్‌మెంట్లలో చేయి పెడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. బాధితులు ఎవ్వరైనా డయల్ 100కు ఫోన్ చేస్తే తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు, చిన్నారులను మాయమాటలతో వేధించినా, వారిపై అత్యాచారాలు, అఘాయిత్యాలకు పాల్పడినా వెంటనే నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపుతామన్నారు. త్వరలో సబ్ డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహించి ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు పెద్దపీట వేస్తామని అన్నారు. అన్ని పోలీసు స్టేషన్లలో రిసెప్షన్ కేంద్రాల పనితీరుపై ఆయా సీఐలు సమీక్షించి, అక్కడకు వచ్చే బాధితులను నవ్వుతూ పలకరిస్తూ వారి సాధక బాధలను పరిష్కరించాలని అన్ని సబ్ డివిజన్ల డీఎస్పీలకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. రాత్రిపూట గస్తీ ముమ్మరంగా తిరగాలని ఆదేశించారు.

రాష్ట్ర ఫార్మసిస్టు సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా గుడిసె భార్గవరెడ్డి



తిరుపతి(వైద్యం), ఆగస్టు 25: రాష్ట్ర ఫార్మసిస్టు సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా డాక్టర్ గుడిసె భార్గవరెడ్డిని నియమించినట్లు ఆదివారం తెలిపారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తిలి సత్యనారాయణ తనపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతలను నిస్వార్థంగా నిర్వర్తిస్తానని ఆయన తెలిపారు. రాష్ట్రంలోని ఫార్మసిస్టుల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేయడంతోపాటు ఫార్మాడీ చేసిన వారికి పీహెచ్‌సీల్లో తగిన ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానన్నారు. ఫార్మసిస్టులు లేకుండా నిర్వహిస్తున్న మందుల మందుల దుకాణాలపై తగు చర్యలు చేపట్టి ఫార్మసిస్టులకు తగిన న్యాయం చేస్తానని ఆయన తెలిపారు.

రౌడీషీటర్లకు ఏఎస్పీ కౌన్సెలింగ్



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 25: చంద్రగిరి సబ్ డివిజన్ పరిధిలోని ఎంఆర్ పల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఆదివారం జిల్లా అదనపు ఎస్పీ నాగభూషణరావు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎంఆర్‌పల్లి స్టేషన్‌లో సీఐ షాదిక్ ఆలీ ఆధ్వర్యంలో ఎస్ఐలు షేక్షావలి, నాగేంద్రబాబు, ఏఎస్ఐలు రాఘవ, రాము, సిబ్బంది కలిసి పేరు మోసిన రౌడీ షీటర్లను పిలిచి వారి సత్ప్రవర్తన, నడవడిక, ఎక్కడెక్కడ అల్లర్లు, రౌడీయిజానికి పాల్పడుతున్నారో అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ హెచ్చరించారు. ఎంఆర్‌పల్లి పరిధిలో వున్న దాదాపు 45 మంది కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని సీఐని ఆదేశించారు. వివిధ కేసుల్లో అరెస్టయి జైలు నుంచి బయటకు వచ్చిన వారిపై కూడా నిఘా ఉంచాలన్నారు.

నీలాకాశం



తిరుమల శ్రీవారి ఆలయంపై ఆకాశం ఆదివారం నీలిరంగులో కనువిందు చేసింది. తెల్లటి మేఘాలు, నీలి రంగులో ఉన్న ఆకాశాన్ని పలువురు భక్తులు ఆసక్తి తిలకించారు.
- తిరుమల, ఆంధ్రజ్యోతి

హామీలు అమలు చేయడంలో ముందున్న డిప్యూటీ సీఎం


డిప్యూటీ సీఎం విజయాలను ప్రదర్శిస్తున్న జనసేన నాయకులు

తిరుపతి (ఆటోనగర్), ఆగస్టు 25: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడునెలలు కూడా గడవకముందే ఇచ్చిన హామీలు అమలు చేయడంలో డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ముందున్నారని ఆ పార్టీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవర మనోహర్ కొనియాడారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఇచ్చిన హామీల మేరకు పంచాయతీలకు నిధులు విడుదల చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలసి చర్చించడం, రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు అన్ని పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించడంలో పవన్ కళ్యాణ్ విజయం సాధించారని చెప్పారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పంచాయతీలకు నిధులు కేటాయించకుండా పంచాయతీ రాజ్ వ్యవస్థను సర్వనాశనం చేసిందని ఆయన విమర్శించారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు హరికృష్ణ, మురళిరెడ్డి, సాయి, హరి, వీరమహిళ విజయనిర్మల పాల్గొన్నారు.

టీటీడీ ఇంటి స్థలాల అభివృద్ధిపై అసంతృప్తి


ఇంటిస్థలాలను పరిశీలిస్తున్న టీటీడీ ఉద్యోగుల బృందం

తిరుపతి అర్బన్, ఆగస్టు 25: వడమాలపేట మండలం పాదిరేడు అరణ్యంలో కేటాయించిన ఇంటి స్థలాల వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులపై టీటీడీ ఎంప్లాయిస్ బ్యాంకు ఉపాధ్యక్షులు చీర్లకిరణ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కొంత మందికి హద్దులు, ప్లాట్ నంబర్లు కూడా చూపలేదని ఆవేదన చెందారు. ఆదివారం తన బృందంతో టీటీడీ ఇళ్లస్థలాల ప్రాంతాన్ని సందర్శించారు. 430ఎకరాల్లో 5219మంది ఉద్యోగులకు ఇళ్లస్థలాలు కేటాయించగా, వాటి రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా దాదాపుగా పూర్తయిందన్నారు. టీటీడీ నిధులతోనే పెండింగ్ పనులు పూర్తి చేయాలని కోరారు. మిగిలిన 4వేల మందికి కూడా త్వరితగతిన ఇళ్లస్థలాలు కేటాయించే ప్రక్రియను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సునీల్‌యాదవ్, రేఖ, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

లాక్‌పతి దీదీపై మహిళలకు అవగాహన



సభ్యులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఓజిలి, ఆగస్టు 25 : అక్క చెల్లెమ్మలను లక్షాధికారులుగా చేసేలా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'లాక్‌పతి దీదీ' పథకంపై ఓజిలిలోని స్త్రీ శక్తి భవనంలో సభ్యులకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల ఏపీఎం నిర్మల అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పంచాయతీల పరిధిలోని వీఓఏలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు. ఎంపిక చేసిన సంఘం నుంచి ఇద్దరు సభ్యులకు చిన్నతరహా పరిశ్రమలు, వ్యాపారం వంటివి ప్రారంభించుకునేందుకు ఆర్థిక సాయం అందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్దేశించారు. ఈక్రమంలోనే వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం సభ్యులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎంతోపాటు జిల్లా టీడీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, మండల టీడీపీ కన్వీనరు విజయకుమార్‌నాయుడు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్, బీజేపీ నాయకులు ప్రసాద్, మైనారిటీ నాయకులు అల్లాభక్షులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహన చోదకులకు హెచ్చరికలు

ఓజిలి, ఆగస్టు 25 : రాజుపాళెం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదం నేపథ్యంలో ఆదివారం ఎస్‌ఐ రవిబాబు పలు ప్రాంతాలలో పర్యటించారు. నిబంధనలు పాటించని ద్విచక్రవాహన చోదకులకు హెచ్చరికలు జారీ చేశారు. రోడ్డు ప్రమాద నివారణపై సూచనలు చేశారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. రహదారి సూచనలు పాటించాలన్నారు. పలు వాహనాలను ఆయన తనిఖీ చేశారు.

ఉపాధ్యాయుల క్రికెట్ పోటీల ప్రారంభం



బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, ఆగస్టు 25: ఉపాధ్యాయులకు క్రీడాపోటీలను నిర్వహించేందుకు ప్రగతి సేవాసంస్థ ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడిలో ఉండే ఉపాధ్యాయులకు ఆటవిడుపుగా ఉండేందుకు పోటీలు దోహదపడతాయన్నారు. 19 మండలాలకు చెందిన ఉపాధ్యాయుల జట్లు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం సర్వేపల్లి రాధకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్‌రెడ్డి, అబ్దుల్‌రహీం, వేగూరు రాజేంద్రప్రసాద్, శివకుమార్, సంస్థ అధ్యక్షుడు కే. చంద్రశేఖర్, ప్రకాశ్‌రావు, సురేష్‌బాబు, మురళీ సింగ్, రవూఫ్, ఉపాధ్యాయులు, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మిలటరీస్కూల్స్ ప్రవేశపరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), ఆగస్టు 25: జాతీయస్థాయిలో 2025-26 విద్యాసంవత్సరానికి రాష్ట్రీయ మిలటరీస్కూల్స్‌లో 6, 9 తరగతుల్లో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశపరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం పోటీపరీక్షల ఉచిత సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. ఈపరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు వయసు ఆధారంగా 5 నుంచి 9 తరగతులు చదివే బాల, బాలికలకు అవకాశం ఉందని, వచ్చేనెల 19వ తేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందని తెలిపారు. ప్రవేశపరీక్షా విధానం, దరఖాస్తు వంటి ఇతర వివరాలకోసం తిరుపతిలో వరదరాజనగర్‌లోని విశ్వంస్కూల్‌లోగానీ లేదా 86888 88802/ 93999 76999 ఫోన్ నెంబర్లని సంప్రదించాలని కోరారు. కాగా జాతీయస్థాయిలో నిర్వహించే పలు పోటీపరీక్షలకు దరఖాస్తు గడువుతేదీ, విద్యార్హత వంటి వివరాలు ఈవిధంగా ఉన్నాయి.

కోర్సు	ప్రవేశం	దరఖాస్తుకు చివరితేదీ
నవోదయ	6వతరగతి	16-09-2024
ఆర్ఐఎంసీ	8వతరగతి	30-09-2024
మిలటరీస్కూల్స్	6 నుంచి 9తరగతులు	19-09-2024

ఉచిత కంటి వైద్యశిబిరం

గూడూరు అర్బన్, ఆగస్టు 25: స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం పెళ్లకూరు చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ డైరెక్టర్ గౌరీశంకర్ మాట్లాడుతూ తిరుపతి వెంకటేశ్వర అరవింద్ నేత్రాలయం ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి వైద్యపరీక్షలను నిర్వహించారన్నారు. మందులను పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో సీతారామనాయుడు,డాక్టర్ కీర్తన, డాక్టర్ దీప్తి, కృష్ణ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

సబ్‌కలెక్టర్‌గా రాఘువేంద్ర మీనా

గూడూరు అర్బన్, ఆగస్టు 25: గూడూరు సబ్ కలెక్టరుగా రాఘువేంద్రమీనాను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులను జారీ చేసింది. ఇక్కడ ఆర్డీవోగా పనిచేస్తున్న కిరణ్‌కుమార్‌ను బదిలీ చేసింది. ఆయన స్థానంలో 2022 బ్యాచ్ ఐఏఎస్ అధికారి రాఘువేంద్రమీనాను సబ్ కలెక్టర్‌గా నియమించారు. ట్రైనీ కలెక్టర్‌గా శిక్షణ ముగించుకున్న ఈయనకు తొలి పోస్టింగ్ ఇది.

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి

పెళ్లకూరు, ఆగస్టు 25 : మండలంలోని కానూరు రాజుపాలెం గ్రామ శివారు అటవీ ప్రాంతంలో కోడిపందేల స్థావరంపై ఆదివారం స్థానిక ఎస్‌ఐ శ్రీకాంత్ సిబ్బందితో దాడి చేశారు. కోడిపందేలు నిర్వహిస్తున్నారనే సమాచారం అందుకున్న పోలీసులు దాడులు చేసి 19 మందిని అదుపులోకి తీసుకున్నారు రూ.3280 నగదు స్వాధీనం చేసుకున్నారు. 10 బైక్‌లు, 17 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.. వీరందని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సోమవారం వీరికి కోర్టులో హాజరుపరచనున్నటు పేర్కొన్నారు.

అంధుల ఫుట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

వెంకటగిరి, ఆగస్టు 25 : పాక్షిక అంధత్వమున్న వారికి ఏపీ బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ సెలక్షన్స్, కోచింగ్ క్యాంపు ఆదివారం తిరుపతిలో నిర్వహించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు పెంచల నరసయ్య తెలిపారు. వెంకటగిరిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వివిధ జిల్లాలకు చెందిన 20 మంది క్రీడాకారులు ఎంపికకు హాజరయ్యారన్నారు. పది మంది ఎంపికైనట్లు వివరించారు. వీరు అక్టోబరులో గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి టోర్నమెంటులో పాల్గొంటారన్నారు. అసోసియేషన్ ద్వారా అంధ క్రీడాకారులకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా ఫుట్‌బాల్ కోచ్ హరిబాబు, శాంసన్, జిల్లా అసోసియేషన్ కార్యదర్శి ముపాళ్ల శేషగిరిరావు, మునిరత్నం, కోశాధికారి వినయ్ కుమార్, ట్రస్టు సభ్యులు రంగినేని రాజా పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక



కోట, ఆగస్టు 25 : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం విద్యార్థులు రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం వారిని స్కూలు ప్రిన్సిపాల్ అద్దూరు వెంకటేశ్వర్లు, వ్యాయామా ఉపాధ్యాయులు రాజ్‌కుమార్‌లు షీల్డ్‌లు, మెమెంటోలతో అభినందించారు. ఇక్కడి గురుకులానికి చెందిన 25 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ పోటీల్లో పాల్గొనేందుకు రేణిగుంట బయలుదేరి వెళ్లారు. గెలుపొందిన విద్యార్థులకు సెప్టెంబరులో జరిగే జాతీయస్థాయి ఎంపికలు జరుగుతాయి.

నేటి నుంచి జాతీయ క్రీడాదినోత్సవ పోటీలు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 25: ప్రపంచ ప్రఖ్యాత హాకీ క్రీడాకారుడు, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని సోమవారం నుంచి 31వ తేదీ వరకు జాతీయ క్రీడాదినోత్సవ ప్రత్యేక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే క్విజ్, వ్యాసరచన పోటీలు కూడా నిర్వహిస్తామన్నారు. అంతర్ పాఠశాలలు, కళాశాలలతో పాటు జిల్లా స్థాయిలో వాక్‌రేసు, వాలీబాల్, హాకీ, మినీఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, చెస్, జూడో, బాక్సింగ్, యోగా తదితర క్రీడాంశాలలో పోటీలు జరుగుతాయన్నారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పతనమవుతున్న ధాన్యం ధరలపై దిగాలు

● దళారుల చేతిలో మోసపోతున్న రైతులు



ధాన్యాన్ని లారీలకు లోడ్ చేస్తున్న కూలీలు

సూళ్లూరుపేట, ఆగస్టు 25: ధాన్యం ధరలు రోజురోజుకూ పడిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో పరిధిలోని పలు గ్రామాల్లో ఫిల్టర్ పాయింట్ నీటి సౌకర్యం ఉండే ప్రాంతాల్లో దాదాపు 7 వేల ఎకరాల్లో రైతులు వరి కోతలకు సిద్ధమయ్యారు. నాట్ల ప్రారంభంలో అడపాదడపా వర్షాలు కురియడంతో రైతులు ఉత్సాహంగా సాగుచేశారు. ఎం2-1010 రకం, కేఎన్ఎం-1638 రకాలను ఎక్కువగా చేశారు. అప్పులు చేసి అధిక పెట్టుబడులు పెట్టారు. చాలాచోట్ల పంట కోత దశకు చేరుకుంది. మంగానెల్లూరు, మంగళంపాడు, మన్నారుపోలూరు తదితర ప్రాంతాల్లో కోస్తున్నారు. ఇదే సమయంలో ధాన్యం ధరలు పతనమవ్వడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. వారం రోజుల ముందు పుట్టి రూ.17400 నుంచి రూ.18,200 వరకు ఉంది. ప్రస్తుతం రూ.15,500 నుంచి రూ.16,000కు పడిపోయింది. కేఎన్ఎం 1638 రకం పుట్టి వారం రోజుల క్రితం రూ.22 వేలు దాకా పలికింది. ప్రస్తుతం రూ.20 వేలకు పడిపోయిందని సమాచారం. మరోపక్క దళారులు మాయమాటలు చెప్పి తక్కువ ధరలకు కొనేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దళారులు ఇక్కడ కొనుగోలు చేసి తమిళనాడులో అధిక ధరలకు విక్రయించుకొని సొమ్ము చేసుకొంటున్నారు.

క్రికెట్ పోటీల విజేత గుడ్రావారిపాళెం జట్టు



చిల్లకూరు, ఆగస్టు 25: మండలంలోని మోమిడిలో శశికుమార్, శేషేంద్ర జ్ఞాపకార్థం స్థానిక యువత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. గుండ్రావారిపాళెం జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో మోమిడి-గుండ్రావారిపాళెం జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన మోమిడి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. అనంతరం గుండ్రావారిపాళెం జట్టు 15 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 153 పరుగులతో విజేతగా నిలిచింది. విజేత జట్టుకు ట్రోఫీతోపాటు రూ.40 వేలు నగదు బహుమతి, రన్నర్స్ జట్టు రూ. 20వేలు నగదు బహుమతిని నిర్వాహకులు అందజేశారు.

మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి



మండల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కోట, ఆగస్టు 25 : బీసీ కులాల కోసం మండల్ కమిషన్ చేసిన సిఫార్సులను అమలు చేయడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని బీఎస్పీ నాయకులు ఆవేదన వ్యక్తంచేశారు. కోటలోని బీసీ కులాల ఐక్యవేదిక కార్యాలయంలో ఆదివారం బీసీ ఉద్యమకారుడు మండల్ చిత్రపటానికి బహుజన సమాజ్‌పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాశన భాస్కర్‌గౌడ్, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ జనాభాలో 50శాతం వరకు ఉన్న బీసీలకు అన్యాయం జరుగుతోందన్నారు. బీసీ కులగణన పూర్తిచేయగలిగితే ఆయా సామాజిక వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల నాయకులతో భాస్కర్‌గౌడ్‌తోపాటు నియోజకవర్గ ఇన్‌చార్జి మీజూరు సుబ్రహ్మణ్యం సమీక్ష జరిపారు.

ముమ్మరంగా బీజేపీ సభ్యత్వ నమోదు



సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్రరెడ్డి

పెళ్లకూరు, ఆగస్టు 25 : మండలంలోని పాలచ్చూరులో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమ ఇన్‌చార్జి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు సభ్యత్వం పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధినాయకత్వం పిలుపు మేరకు సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల్లో సభ్యత్వ నమోదు కోసం విస్తృతంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లోని కార్యకర్తలందరూ పాల్గొని పెద్ద సంఖ్యలో సభ్యత్వ నమోదు చేయించాలని కోరారు. మండల బీజేపీ అధ్యక్షుడు గోగుతోటి మురళి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి నరసింహులు, సతీష్, పృధ్వీరాజ్ ఉన్నారు.

వెలుగు ఆధ్వర్యంలో సీఆర్పీలు,వీఆర్వోలకు ప్రశంసాపత్రాలు



ప్రశంసా పత్రాలను వీవోఏకి అందజేస్తున్న కూటమి నాయకులు

కోట, ఆగస్టు 25 : కోటలోని వెలుగు కార్యాలయంలో ఆదివారం కేంద్ర ప్రభుత్వ పథకం లక్‌పతిదీదీపై అవగాహన కార్యక్రమం జరిగిది. ఈ సందర్భంగా వెలుగు ఏపీఎం రత్నయ్య ఆధ్వర్యంలో పలు రంగాలలో సేవాకార్యక్రమాలు చేసిన సీఆర్‌పీలు, వీవోలకు కూటమి నాయకుల చేతులమీదుగా ప్రసంశాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు సారంగం రమేష్‌బాబు, జడ్పీటీసీ కోటయ్య, కూటమి నాయకులు పనబాక కోటేశ్వరరావు, నెల్లూరు మోహన్‌రెడ్డి, శంకర్, భాస్కర్, ప్రసాద్, కృష్ణమ్మ పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోట, ఆగస్టు 25 : మండల పరిధిలోని చిట్టేడు వద్ద ఆదివారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు లేకుండా రుద్రవరం, ఊనుగుంటపాళెం, స్వర్ణముఖినది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

సూళ్లూరుపేట, ఆగస్టు 25: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో చెన్నై వైపు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు. మృతుని జేబులో సూళ్లూరుపేట నుంచి చెన్నైకి టికెట్ కనిపించింది. ఎటువంటి ఆధారాలు లేవు. కాఫీ రంగు గడుల చొక్కా, నలుపు రంగు జీన్స్ ధరించి ఉన్నాడు. 45 నుంచి 50 సంవత్సరాలుంటాయి. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకోని మహిళ ఆత్మహత్య

దొరవారిసత్రం, ఆగస్టు 25 : వేణుంబాక ఎస్టీ కాలనీకి చెందిన చిలకల శాంతి(40) ఆదివారం ఆత్మహత్యకు పాల్పడింది. శివారులోని పొలాల్లో వేపచెట్టుకు చీరతో ఉరి వేసుకోని మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు. మృతదేహాన్ని పోలీసులు నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమెకు 20 ఏళ్ల క్రితం రమేష్ అనే వ్యక్తితో వివాహం అయింది. ఇద్దరు పిల్లలున్నారు. కొంత కాలంగా శాంతికి మానసిక పరిస్థితి బాగాలేదు. ఇంటి నుంచి తరచూ వెళ్ళి పోవడం, తిరిగి రావడం చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం కూడా ఇదేతరహాలో ఇంటి నుంచి వెళ్లి ఉరివేసుకోని చనిపోయినట్లు భావిస్తున్నారు. కేసు విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తిరుమలరావు తెలిపారు.

కోటమ్మకు విశేష పూజలు



కోట, ఆగస్టు 25 : స్థానిక గ్రామదేవత కోటమ్మ అమ్మవారికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అభిషేకాలు చేసి చందన, పుష్పాలతో అలంకరించారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకున్నారు. వారికి పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

చిల్లకూరు, ఆగస్టు 25: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలోని ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు నైవేద్యంగా నివేదించారు. ప్రత్యేక అలంకారంలో ఉన్న ముత్యాలమ్మను దర్శించుకున్నారు. ఆలయం ఎదుట త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల కోసం వేట

● కేరళ, బెంగళూరు, చెన్నై వాసులుగా అనుమానం

● ప్రత్యేక బృందాల గాలింపు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 25: తిరుపతి ఎంఆర్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని రామానుజపల్లి చెక్‌పోస్టు వద్ద శుక్రవారం పోలీసులకు వాహనాల తనిఖీలో పట్టుబడిన రూ.50 లక్షల లిక్విడ్ గంజాయి, కేరళ రిజిస్ట్రేషన్ వున్న కారు ఆధారంగా గంజాయిని సరఫరా చేసే వారు అంతర్ రాష్ట్ర ముఠాగా పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు కనపడిన వెంటనే కారుతో సహా గంజాయి బ్యాగులను వదలి పరారైన ముగ్గురి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. చంద్రగిరి డీఎస్పీ నరసింగప్ప నేతృత్వంలో సీఐ షాదిక్ అలి పర్యవేక్షణలో దాదాపు 10 మంది పోలీసులు వీరి కోసం గాలిస్తున్నారు. కారు కేరళ రిజిస్ట్రేషన్ కలిగి ఉండటంతో కేరళకు చెందిన ముఠానే గంజాయి సరఫరా చేస్తోందని పోలీసులు అనుమానం వ్యక్తపరుస్తున్నారు. కారు రిజిస్ట్రేషన్ ఎవరి పేరున వుంది? గంజాయి ముఠాకు కారు ఎవరైనా ఇచ్చారా లేకుంటే వారే స్వయంగా తీసుకొచ్చారా అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. ఇప్పటికే గంజాయి ముఠా ఎవ్వరనే విషయం పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ఇదిలా వుండగా అంతర్ రాష్ట్ర గంజాయి ముఠా కోసం బెంగళూరు, చెన్నై, కేరళకు ప్రత్యేక పోలీసు బృందాలు వెళ్లినట్లు సమాచారం.

వైభవంగా కుంభాభిషేక వేడుకల ప్రారంభం



కుంభాభిషేక వేడుకలకు వేదారంభం చేస్తున్న వేద పండితులు

సూళ్లూరుపేట, ఆగస్టు 25: మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరులో సత్య జాంబవతి సమేత అలఘు మల్లారి కృష్ణస్వామి ఆలయంలో ఆదివారం నుంచి టీటీడీ ఆధ్వర్యంలో అష్టబంధన మహా కుంభాభిషేక వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదపండితులు, మంత్రోచ్ఛారణల నడుమ ఆలయ ప్రాంగణంలో ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేశారు. అంకురార్పరణ తర్వాత సంప్రోక్షణ వేడుకలను ప్రారంభించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, మామిడాకు తోరణాలతో సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సోమవారం అకల్మషహోమం, రక్షాబంధనం, అష్టబంధన సమర్పణ వైభవంగా నిర్వహించనున్నారు. వేడుకలు ఈనెల 28వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ ఇన్‌స్పెక్టర్ లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలకు తిరుపతిలో ట్రాఫిక్ మళ్లింపు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 25: తిరుపతి ఇస్కాన్ టెంపుల్‌లో మూడు రోజుల పాటు జరుగనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు పోలీసు శాఖ తరఫున అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు చెప్పారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని నగరంలో పలు చోట్ల ట్రాఫిక్‌ను మళ్లించామన్నారు. ఈ వేడుకల్లో భక్తులు, వీఐపీలు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొంటారన్నారు. ఇస్కాన్ టెంపుల్ అలిపిరి లింక్ బస్టాండుకు ఆగ్నేయం వైపున, ఉత్తరం, తూర్పున టీటీడీ ఉద్యోగుల క్వార్టర్సు ఉన్నాయన్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, జేబుదొంగలు, చైన్ స్నాచింగ్‌లు, మొబైల్ ఫోన్ల దొంగతనాలు జరిగే అవకాశాలు ఉంటాయన్నారు. ఉత్సవాలు శాంతియుతంగా, ఆలయ ప్రాంగణంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పడానికి పలు జంక్షన్ల వద్ద ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు ఎస్పీ చెప్పారు.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా.....

ఇస్కాన్‌కు వచ్చే భక్తులు తమ వాహనాలను అలిపిరి లింక్ బస్టాండు పార్కింగ్ స్థలంలో ఉంచాలి. అన్నారావు సర్కిల్ రోడ్డు నుంచి వచ్చే ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను బాలాజీ లింక్ బస్టాండులోనే ఆపి అక్కడ నుంచి నడచుకుంటూ ఆలయం వద్దకు చేరుకోవాలి. ఎస్పీ ఆదేశాల మేరకు ట్రాఫిక్, క్రైం శాంతి భద్రతలకు సంబంధించిన 250 మంది పోలీసులను బందోబస్తు నిమిత్తం నియమించినట్లు నగర డీఎస్పీ వెంకటనారాయణ తెలిపారు.

ఎస్సీ రైతులకు టార్పాలిన్ పట్టల పంపిణీ

చిల్లకూరు, ఆగస్టు 25: కమ్మవారిపాళెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ వర్గానికి రైతులకు ఎస్సీ కార్పోరేషన్ ద్వారా మంజూరులైన టార్పాలిన్ పట్టలు, డ్రమ్ములను ఆదివారం స్థానిక సచివాయలంలో అందజేశారు. కడివేడు ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి పూర్ణిమ, టీడీపీ సీనియర్ నాయకుడు పచ్చ వెంకటేశ్వర్లునాయుడు వీటిని పంపిణీ చేశారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని ఈసందర్భంగా కోరారు. ఎక్కువశాతం ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో గజేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

19మంది 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

మూడు కార్లు, గొడ్డళ్లు, రంపాల స్వాధీనం



పట్టుబడ్డ స్మగ్లర్లతో టాస్క్‌ఫోర్సు సిబ్బంది

మంగళం, ఆగస్టు 25: నాగపట్ల అటవీ ప్రాంతంలోకి చొరబడుతున్న 19మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డికి చెందిన కేఏస్కే లింగాధర్ టీమ్ ఆదివారం కూంబింగ్ నిర్వహించారు. ఈ బృందం భాకరాపేట చేరి, అక్కడినుంచి శ్రీవారిమెట్టు వైపు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను తనిఖీ చేసుకుంటూ వెళుతోంది. చంద్రగిరి మండలం నాగపట్ల అటవీ ప్రాంతంలోని నరసింగాపురం రైల్వే గేటు సమీపంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిషేధిత అటవీ ప్రాంతంలో మూడు కార్లు కనిపించాయి. వాహనాలను చుట్టుముట్టగా అందులోని వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని పట్టుకుని విచారించగా, ఎర్రచందనం కోసం అడవిలోకి వెళుతున్నట్లు తేలింది. దీంతో వారిని అరెస్టు చేశారు. వీరిలో తిరుపతి సత్యనారాయణపురానికి చెందిన ఎన్సీ శివ (45), డి.జానకిరామ్ (36), రైల్వే కోడూరుకు చెందిన నాయని శివ (36), తోట లక్ష్మీపతి (30), కార్వేటినగరానికి చెందిన ప్రభాకర్ (45), తమిళనాడు తిరువణ్ణామలై జిల్లాకు చెందిన దక్షిణామూర్తి (29), సిన రాజా (49), కుమార్ చిన్నపయ్యన్ (35), తిరుపత్తూరు జిల్లాకు చెందిన రామ లింగరాజు (54), పార్తిబన్ కుమార్ (24), స్వామినాథన్ అన్నామలై (38), వాసుమణి (23), ఆర్ రవి (40), ఎ.అన్నామలై (35), కార్తీక్ (42), సేతుమణి (26), శంకర్ (44), కుమార్ రాజా (44), కార్తీక్ (25)లుగా గుర్తించారు. వీరి వద్ద నుంచి మూడు కార్లు, నాలుగు పిడిలేని ఇనుప గొడ్డళ్లు, ఓ ఇనుప బరిసె, నాలుగు ఇనుప రంపాలను స్వాధీనం చేసుకున్నారు. వీరిని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించి, సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి భక్తులకు లడ్డూలు త్వరగా అందజేయండి

● టీటీడీ అదనపు ఈవో ఆదేశం

తిరుమల, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): భక్తులు రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో నిరీక్షణ సమయాన్ని తగ్గించి త్వరగా లడ్డూలు అందజేయాలని అధికారులను టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదేశించారు. తిరుమలలోని లడ్డూకాంప్లెక్స్‌లో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. భక్తులు లడ్డూలు పొందే పద్ధతులను పరిశీలించి, అధికారులు సూచనలిచ్చారు. అంతకుముందు శ్రీవారి ఆలయ నాలుగు మాడవీధులను పరిశీలించారు. అక్టోబరు 4నుంచి బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఆలయ డిప్యూటీఈవో లోకనాథంతో కలిసి భక్తులు గ్యాలరీల్లో ప్రవేశించే, బయటకు వచ్చే మార్గాలను స్వయంగా చూశారు. గరుడసేవ రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. వీరితోపాటు వీఎస్వో సురేంద్ర, ఏవీఎస్వో మనోహర్ ఉన్నారు. కాగా, శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.87 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను పరకామణి లెక్కింపులు నిర్వహించి ఆదివారం ఉదయం టీటీడీ ప్రకటించింది.

తిరుచానూరులో ఆక్టోపస్ మాక్‌డ్రిల్





పద్మావతి అమ్మవారి ఆలయం వద్ద మాక్‌డ్రిల్ చేస్తున్న ఆక్టోపస్ బృందాలు

తిరుచానూరు, ఆగస్టు 25: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున టీటీడీ విజిలెన్స్ సిబ్బంది, ఆక్టోపస్ దళం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాదులు చొరబడినపుడు ఏదైనా అత్యవసర పరిస్థితులు వాటిల్లినపుడు ఎలా ఎదుర్కోవాలి.. భక్తులను ఎలా రక్షించాలనే విషయాలను మాక్‌డ్రిల్ ద్వారా చేసి చూపించారు. ఆక్టోపస్ దళాలు రాష్ట్రంలోని ప్రముఖ స్థలాలు, ఆలయాలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఏటా మాక్ డ్రిల్ నిర్వహించడం జరుగుతోంది. ఈ కార్యక్రమంలో వీజీవో నందకిషోర్, ఏవీఎస్వో సతీష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

కిక్కిరిసిన ముక్కంటి ఆలయం



ముక్కంటి ఆలయం వద్ద ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 25: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. వారాంతపు సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 27వేలమంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇందులో రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,633మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,645మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 టిక్కెట్ల ద్వారా 2,645మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,129, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 312మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 243మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 77మంది భక్తులు రాహుకేతు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 16,301 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

బుగ్గవీధి పెద్దకాలువ నిర్మాణానికి కృషి చేయండి



మురుగునీటి కుంటలా మారిన రైలు కట్ట కింద ప్రాంతం

రేణిగుంట, ఆగస్టు 25: రేణిగుంట పంచాయతీ పరిధిలోని బుగ్గవీధి ప్రాంతంలో పెద్దకాలువ నిర్మాణానికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చొరవ తీసుకుని శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ప్రాంతంలోని వీధుల్లో కాలువలు పల్లంగా ఉండటంతో మురుగునీరు మొత్తం రైల్వే కట్ట కిందకు చేరుతోంది. దీంతో సంతగేటు సమీపం నుంచి రైల్వే అండర్‌బ్రిడ్జి వరకు మురుగునీరు నిల్వ చేరుతుండడంతో నిత్యం దోమల బెడద అధికంగా ఉంటోంది. సమస్యను పరిష్కరిస్తామంటూ గత ప్రభుత్వ పాలకులు డ్రైనేజీ నిర్మిస్తామని ఇచ్చిన మాటలు నీటి మూటలుగా మిగిలిపోయాయి. ఈ ప్రాంతంలో వర్షపునీటితో మురుగు కలుస్తుండడంతో ప్రజలు జ్వరాలు బారిన పడిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఈ ప్రాంతం పూర్తిగా రైల్వేశాఖ ఆధీనంలో ఉంది. ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పెద్దకాలువ నిర్మాణానికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ముక్కంటి సేవలో హైకోర్టు రిజిస్ట్రార్



ధ్వజస్తంభం వద్ద శ్రీనివాస శివరామ్ దంపతులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 25: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని ఆదివారం రాష్ట్ర హైకోర్టు రిజిస్ట్రార్ శ్రీనివాస శివరామ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మృత్యుంజయ స్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

యూటీఎఫ్ మహాసభలను జయప్రదం చేయండి

శ్రీకాళహస్తి, ఆగస్టు 25: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబరు 14 నుంచి 17వ తేదీ వరకు కాకినాడలో నిర్వహించే యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం యూటీఎఫ్ జిల్లాస్థాయి కమిటీ సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి, నాయకులు సూర్యప్రకాష్, శేఖర్, నిర్మల, రాజేష్‌బాబు, మోహన్‌బాబు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.10వేల విరాళం

ఏర్పేడు, ఆగస్టు 25: గుడిమల్లంలోని పరశురామేశ్వరస్వామి ఆలయాన్ని యూఎస్‌ఏకి చెందిన బాబ్జి చౌదరి, సుదర్శన్ చౌదరి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు ఈ సందర్భంగా వారు అన్నదానానికి రూ.10వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు, మాజీ సర్పంచు నాయుడు, నవీన్‌యాదవ్, సురేష్‌నాయుడు, పవన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైరల్ ఫీవర్

కేవీబీపురం, ఆగస్టు 25: మండలంలోని పెరిందేశం, కళత్తూరు, కేవీబీపురం, రాయపేడు, ఓళ్లూరు సదాశివపురం గ్రామాల్లో ప్రజలు గత వారం రోజులుగా వైరల్ ఫీవర్‌తో అల్లాడుతున్నారు. వైద్యబృందాలు చికిత్స అందిస్తున్నా తగ్గడంలేదు. ప్రతి ఇంట్లో ఒకరిద్దరు మంచానికి పరిమితమయ్యారు. వైద్యాధికారులు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్స అందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



పవన్ కల్యాణ్‌తో సాయి

శ్రీకాళహస్తి, ఆగస్టు 25: నగరవనాల అభివృద్ధికి శ్రీకాళహస్తి నియోజవర్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేయడంతో ఉపముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్‌ను జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి కొట్టేసాయి ఆదివారం మంగళగిరిలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో హరితాభివృద్ధిలో భాగంగా మొదటి విడతలో 11 నియోజకవర్గాలను ఎంపిక చేయగా, అందులో శ్రీకాళహస్తిలోని కైలాసగిరి నగరవనం ఏర్పాటు చేయాలని నిర్ణయించడం సంతోషకరమన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుపై అవగాహన

శ్రీకాళహస్తి, ఆగస్టు 25: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ సభ్యత్వ నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, తొట్టంబేడు, శ్రీకాళహస్తి పట్టణం, రూరల్ మండలాల నాయకులు పాల్గొన్నారు.

జనసేన జెండా ఆవిష్కరణ



శ్రీకాళహస్తి, ఆగస్టు 25: తొట్టంబేడు మండలం చిట్టత్తూరు పంచాయతీలో ఆదివారం జనసేన జెండాను ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత ఆవిష్కరించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో జనసేన తొట్టంబేడు మండలాధ్యక్షుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

నారాయణవనం, ఆగస్టు 25: మండలంలోని పాలమంగళం ఉత్తరపు కండ్రిగ గ్రామంలో వెలసిన సాయిబాబా సత్సంగ కేంద్రం వార్షికోత్సవ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఉదయం 8 గంటలకు నిత్యప్రార్థన, పారాయణ, సాయినామ సంకీర్తనలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి 7గంటలకు సాయినాధుని చిత్రపటాన్ని ఊరేగించారు.

పారిశుధ్య కార్మికులకు యూనిఫాం వితరణ

శ్రీకాళహస్తి, ఆగస్టు 25: శ్రీకాళహస్తీశ్వరాలయ పారిశుధ్య కార్మికులకు ఆదివారం తమిళనాడు తిరుచ్చికి చెందిన తాయిమాన్ సెల్వం, కవిత దంపతులు 54 జతల యూనిఫాం అందజేశారు.

గురుకులంలో విద్యార్థి అదృశ్యం



లోకేష్

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 25: బుచ్చినాయుడు కండ్రిగ మండలం కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య గురుకుల పాఠశాల నుంచి ఓ విద్యార్థి అదృశ్యం అయ్యాడు. గురుకులంలో పదవ తరగతి చదువుతున్న లోకేష్, శ్రీహరి శుక్రవారం రాత్రి గోడ దూకి బయటకు పోతుండగా ఉపాధ్యాయులు పట్టుకుని మందలించారు. శనివారం ఉదయం ప్రార్థన సమయంలో శ్రీహరి మాత్రమే హాజరయ్యాడు. లోకేష్ అదృశ్యమైనట్లు గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. లోకేష్ తండ్రి బాలు నాయక్, ప్రిన్సిపాల్ ఆదివారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ విశ్వనాథ నాయుడు కేసు నమోదు చేసి విద్యార్థి కోసం గాలింపు చేపట్టారు. కాగా, విద్యార్థి లోకేష్ స్వస్థలం కర్నూలు జిల్లా తుగ్గిలి మండలం గుండాల తాండా.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య



ధనంజయులు (ఫైల్‌ఫొటో)

కేవీబీపురం, ఆగస్టు 25: మండలంలోని ఆరె పంచాయతీ రాళ్లమిట్ట గ్రామానికి చెందిన ధనంజయులు (31) నాలుగు రోజుల క్రితం కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గుర్తించిన బంధువులు వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. అతడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ లోకనాథం తెలిపారు.

స్కూటర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఏర్పేడు, ఆగస్టు 25: ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో స్కూటరిస్టు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం ఏర్పేడు మండలంలో చోటు చేసుకుంది. సీఐ శ్రీరామ శ్రీనివాసులు కథనం మేరకు... మేర్లపాక గ్రామానికి చెందిన తిరుమలశెట్టి వెంకటరమణయ్య(43) ద్విచక్ర వాహనంపై ఆదివారం ఉదయం ఏర్పేడుకు వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా శ్రీకాళహస్తి నుంచి తిరుపతి వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వెంకటరమణయ్య తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నేత ఇంట్లో చోరీ

ఏర్పేడు, ఆగస్టు 25: ఏర్పేడు మండలం వికృతమాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచు, టీడీపీ సీనియర్ నేత పూల హేమాక్షి రాయల్ ఇంట్లో ఆదివారం చోరీ జరిగింది. దొంగలు ఇంట్లో ఉన్న బీరువా లాకర్ తెరిచి, అందులో ఉన్న 20 సంవర్ల బంగారు నగలను ఎత్తుకెళ్లారు. చోరీకి గురైన బంగారు విలువ రూ.10లక్షలు ఉంటుందని బాధితుడు హేమాక్షి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

లారీ బోల్తా

వరదయ్యపాళెం, ఆగస్టు 24: వరదయ్యపాళెం మండలం చిలమత్తూరు పంచాయతీ శ్రీసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఓ లారీ బోల్తా పడింది. స్థానికుల కథనం మేరకు... శ్రీసిటీ వైపు వెళుతున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వాహనాన్ని పక్కకు తప్పించారు.

కోళ్ల పెంపకంపై ముగిసిన శిక్షణ

రేణిగుంట, ఆగస్టు 25: మండల పరిధిలోని చైతన్యపురంలో ఉన్న రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో వారం రోజులు పాటు జరిగిన కోళ్ల పెంపకంపై నైపుణ్య శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. జిల్లా పశువైద్యాధికారి రవికుమార్ మాట్లాడుతూ పెరటి కోళ్ల పెంపకాన్ని కుటీర పరిశ్రమగా చేసుకుంటే గ్రామీణ యువత, రైతులు అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో నాటుకోళ్లకు మంచి డిమాండ్ ఉన్నా, అందుకు తగిన సరఫరా లేదన్నారు. శిక్షణ పొందిన వారికి ధృవపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే అధిపతి డాక్టర్ శ్రీనివాసులు, సీనియర్ శాస్త్రవేత్తలు శ్రీనివాసులు, అనూష పాల్గొన్నారు.

శాంతారామ్ పవార్‌కు నివాళి

శ్రీకాళహస్తి, ఆగస్టు 25: శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి, పురపాలక సంఘ మాజీ చైర్మన్ శాంతారామ్ పవార్ జయంతి ఆదివారం నిర్వహించారు. ది స్కూల్ ఆవరణలోని ఆయన విగ్రహానికి ఆయన కుమార్తె డాక్టర్ అర్చన, సోదరుడు జనార్దన రావు పవార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విశాల, గాజుల సత్యనారాయణ, శెట్టిపల్లి సురేష్, సుబ్రహ్మణ్యం, ఆవుల జయరామ్, ప్రతాప్‌రావ్ పవార్, పరమేశ్వరరావు పవార్, మధు, మహబూబ్‌బాషా, రాము తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

వడమాలపేట, ఆగస్టు 25: వడమాలపేటలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తిరుపతికి చెందిన సురేంద్ర కంటి వైద్యశాల ఆధ్వర్యంలో స్థానిక యోగేష్ ఆప్టికల్స్ సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరాన్ని టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు ప్రారంభించారు. కంటి సమస్యలు ఉన్న వారికి పరీక్షలు చేశారు. పదిమందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణుడు సురేంద్ర, యోగేష్ ఆప్టికల్స్ యజమాని యాయతి నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

27నుంచి గంగజాతర

పుత్తూరు టౌన్, ఆగస్టు 25: పుత్తూరు పట్టణంలో బజారువీధిలో వెలసిన గ్రామదేవత పిడికిలి గంగమ్మ జాతర ఈనెల 27 నుంచి ప్రారంభం అవుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. 27న మంగళవారం ఉదయం 5 గంటలకు గ్రామదేవత ఆరేటమ్మకు విశేష పూజలు, రాత్రి గంగజాతర చాటింపు, సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 3 వరకు గెరిగ ఊరేగింపు, 3వ తేదీ మంగళవారం చాటు బండి ఊరేగింపు, 4వ తేదీన జాతర నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. అదేరోజు రాత్రి పాట కచ్చేరి ఉంటుందన్నారు.

జగనన్న కాలనీలో ఇంటి స్థలాల విక్రయం

అడ్డుకున్న చిన్నపాండూరు గ్రామస్తులు



అక్రమార్కులను అడ్డుకుంటున్న గ్రామస్తులు

వరదయ్యపాళెం, ఆగస్టు 25: జగనన్న కాలనీలో ఇంటి స్థలాలను విక్రయిస్తున్న వైసీపీ నేతను స్థానికులు అడ్డుకున్నారు. వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరు పంచాయతీ పరిధిలోని చిన్నపాండూరు - పెద్దపాండూరు మార్గంలో ఆంజనేయస్వామి విగ్రహం సమీపంలో సర్వే నెంబరు 68/8, 9లో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలంలో నాలుగేళ్ల కిందట జగనన్న కాలనీ పేరిట ఇంటి స్థలాలను మంజూరు చేశారు. కొందరు గృహనిర్మాణాలు చేపట్టారు. కొందరు బినామీల పేరిట పట్టాలు పొంది, అనర్హులకు విక్రయించారు. మరికొంత స్థలం ఖాళీగా ఉండడంతో స్థానిక గిరిజనులు తాత్కాలిక గుడారాలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ ఖాళీ భూమిపై స్థానిక వైసీపీ నాయకులు కన్నేశారు. చిన్నపాండూరు వద్ద హీరో, అపోలో వంటి పరిశ్రమలు రావడంతో అక్కడి భూముల ధరలు అమాంతం పెరిగాయి. కార్మికులు, ఉద్యోగుల నివాసాల కోసం ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి భారీ నివాస గృహాలు, బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో అక్కడ నివాస స్థలాలకు గిరాకీ ఏర్పడింది. సెంటు స్థలం ధర లక్షల్లో పలుకుతోంది. ఈ నేపథ్యంలో ఖాళీగా భూమి విక్రయించడానికి వైసీపీ నాయకులు సిద్ధమయ్యారు. రెండురోజుల కిందట సెంటు స్థలం రూ.1.50 నుంచి రూ.2లక్షల చొప్పున ఒక్కో ప్లాటును రూ.5లక్షలకు విక్రయించడంతో స్థానికులు అడ్డుకున్నారు. పేదల ఇంటి స్థలాలు కోసం కేటాయించిన భూమిని ఎలా విక్రయిస్తారని నిలదీశారు. రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినా చర్యలు తీసుకోకపోవడంతో వారి పాత్రపైనా స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దారు రాజశేఖర్‌ను వివరణ కోరగా చిన్నపాండూరులోని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా స్థలాలు కొనుగోలు చేసినా, నిర్మాణాలు సాగించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రభుత్వం మారినా.... అధికారుల తీరు మారదాయే..!



పుదుకుప్పంలోని రైతు భరోసా కేంద్రం

సత్యవేడు, ఆగస్టు 25: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు అవుతున్న ఇప్పటికీ అధికారుల తీరు మారలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను నిర్మించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మండలంలోని పుదుకుప్పంలో కూడా ఒక ఆర్‌బీకే కేంద్రాన్ని నిర్మించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుభరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మారుస్తూ జీవోను తీసుకొచ్చింది. ఈ మేరకు ఆర్‌బీకేలను రైతు సేవాకేంద్రాలుగా పేరు మార్పుచేశారు. అయితే పుదుకుప్పంలో నిర్మించిన ఆర్‌బీకే పేరు మార్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి ఆర్‌బీకే పేరు మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

పూరిల్లు దగ్ధం

సత్యవేడు, ఆగస్టు 25: మండలంలోని రాజగోపాలపురంలో ఆదివారం ఓ పూరిల్లు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధితుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన రమేష్, లక్ష్మమ్మ దంపతులు పూరింట్లో ఉంటున్నారు. ఆదివారం ఇంటికి తాళాలు వేసుకుని వరదయ్యపాళెంకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో జరిగి మంటలు చెలరేగాయి. ఇంటిపైన టార్పాలిన్ పట్ట కప్పి ఉండడంతో మంటలు పెద్దగా వ్యాపించి పొగ బయటకు వచ్చేంత వరకు గుర్తించలేకపోయారు. ఒక్కసారిగ మంటలు వ్యాపించడంతో గ్రామస్తులు అతికష్టం మీద మంటలను ఆర్పారు. అయితే అప్పటికే ఇంట్లో ఉన్న వస్తువులు, బట్టలు, రూ.15వేల నగదు కాలి బూడిదయ్యాయి. బాధితులను జనసేన మండల అధ్యక్షుడు రూపేష్ కుమార్ పరామర్శించారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

ఆర్డీవో కార్యాలయ ముట్టడికి సిద్ధం కండి

శ్రీకాళహస్తి, ఆగస్టు 25: భూ సమస్యలపై వచ్చే నెల 5వ తేదీ ఆర్డీవో కార్యాలయ ముట్టడికి సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి మండలం రామాపురం భగత్‌సింగ్ కాలనీలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు కావస్తున్నా నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో దళితులు, గిరిజనులకు కనీస వసతులైన తాగునీరు, రోడ్లు కల్పించకపోవడం బాధాకరమన్నారు. భూమిని నమ్ముకుని బతికే దళిత, గిరిజనులకు కనీసం ఎకరా భూమిని కూడా ప్రభుత్వాలు ఇవ్వకపోవడం పేదలను మోసం చేయడమేనని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో భూదందాలు, భూఆక్రమణలు విపరీతంగా పెరిగిపోయాయని, వాటిపై సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా ఈనెల 28న రాష్ట్రస్థాయి సదస్సు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పెంచలయ్య, రాధాకృష్ణ, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ సమతుల్యత



మొక్కలను పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 25: మొక్కల పెంపకంతోనే పర్యావరణ సమతుల్యత సాధ్యమని జేబెన్ ఫార్మ్స్ అధినేత జలగం శ్యామ్ అన్నారు. తొట్టంబేడు మండలం పూడి గ్రామస్తులకు అల్లనేరేడు, జామ, బాదం, సపోటా, నేరేడు, మామిడి చెట్లను స్పందన స్వచ్ఛంద సంస్థ, చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. చక్రినాయుడు, మాధవ నాయుడు, శ్రీనివాసులు నాయుడు, ప్రసాద్, ప్రభాకర్, ఆనంద్ నాయుడు, వేణుగోపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీపీ, షుగర్ అదుపుతో కంటి సమస్యలు దూరం



డాక్టర్ శ్రీనాథ్‌ను సన్మానిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

పుత్తూరు టౌన్, ఆగస్టు 25: షుగర, బీపీ అదుపులో ఉంటే కంటి సమస్యలు రావని అరవింద్ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ శ్రీనాథ్ తెలిపారు. ఆదివారం పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ సమావేశం అధ్యక్షుడు కేఎల్ మూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన తిరుపతి అరవింద్ ఆస్పత్రి డాక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ వయసు పెరిగే కొద్ది కంటి నరాల్లో బలహీనత ఏర్పడుతందని, శుక్లవ్యాధి, రెటీనా దెబ్బతిని చూపు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. 40 సంవత్సరాలు దాటిన తర్వాత బీపీ, షుగర్‌తో పాటి కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం డాక్టర్ శ్రీనాథ్‌ను వాకర్స్ అసోయేషన్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత వైద్యులు శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శి మునికృష్ణయ్య, నరసింహారావు, రామచంద్ర నాయుడు, మురుగేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీకృష్ణ జయంతి ఉత్సవాలు

పుత్తూరు టౌన్, ఆగస్టు 25: పుత్తూరు పట్టణంలోని కామాక్షీదేవి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయంలో నెలకొన్న గీతా మందిరంలో నేటి నుంచి శ్రీకృష్ణ జయంతి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు గీతా సేవా సమాజం నిర్వాహకులు తెలిపారు. 26వ తేదీ సోమవారం అఖండ గీతా పారాయణం, 27 నుంచి సెప్టెంబర్ 2వ తేదీ వరకు ప్రతిరోజూ సాయంత్రం వేదాంతం శీనివాస భట్టాచార్యులచే ప్రవచనాలు ఉంటాయన్నారు. ఈనెల 30న రుక్మిణి కల్యాణం, సెప్టెంబర్ 3న గోపూజ, వసంతోత్సవం జరుగుతుందని తెలిపారు.

ప్రజాకళా ఉత్సవాలను జయప్రదం చేయండి

పుత్తూరు టౌన్, ఆగస్టు 25: శ్రీకాళహస్తి పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో ఈనెల 31వ తేదీన జరిగే గ్రామీణ జానపద ప్రజాకళా ఉత్సవాలను జయప్రదం చేయాలని ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి జింక నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం పుత్తూరు మండలం ఐఆర్ కండ్రిగలో ప్రజాకళా ఉత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో కోలాటం గురువు ముకుంద, కోలాట బృందం గౌరవాధ్యక్షుడు మహేష్, ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి గోపి, దేశమ్మ, సుబ్బమ్మ, అలివేలు, రవి పాల్గొన్నారు.

పంచాయతీ వేలంపాటలో జాప్యం ఎందుకో?

రేణిగుంట, ఆగస్టు 25: రేణిగుంట పంచాయతీ దినసరి కూరగాయల మార్కెట్, వారపుసంత, బస్టాండు పార్కింగ్ వేలం నిర్వహణలో జాప్యం జరుగుతూనే ఉంది. దీంతో పంచాయతీకి రావాల్సిన ఆదాయానికి గండిపడుతోంది. రేణిగుంట పంచాయతీ దినసరి కూరగాయల మార్కెట్, వారపుసంత, బస్టాండు పార్కింగ్ రుసుం వసూలు గడువు ఈ ఏడాది మార్చిలో ముగిసింది. అప్పటికే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పంచాయతీ అధికారులు వేలం పాటను వాయిదా వేశారు. పంచాయతీ సిబ్బందే రుసుము వసూలు బాధ్యత చేపట్టింది. ఇందులో సిబ్బంది చేతివాటం ప్రదర్శించడంతో అధికారులు గతేడాది కంటే 10శాతం పెంచి పాత కాంట్రాక్టర్లకే అప్పగించారు. అయితే కాంట్రాక్టర్లు పంచాయతీకి సకాలంలో సొమ్ములు చెల్లించడంలేదని సమాచారం. కాగా, కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు గడస్తున్నా పంచాయతీ వేలంపాట నిర్వహించలేదు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు వేలం పాట నిర్వహించాల్సిన అవసరం ఉంది.

సింహవాహనంపై చెంగాళమ్మ పరమేశ్వరి



వరదయ్యపాళెం, ఆగస్టు 25: మండల కేంద్రంలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న తిరునాళ్లలో భాగంగా శనివారం రాత్రి అమ్మవారు సింహవాహనంపై పురవీధుల్లో ఊరేగారు. ఆలయ ధర్మకర్త బొప్పన తిలక్ ఆధ్వర్యంలో బాణసంచా పేలుళ్లు, మంగళవాయిద్యాలు నడుమ అమ్మవారు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

కార్డన్ సెర్చ్

శ్రీకాళహస్తి, ఆగస్టు 25: పట్టణంలోని నక్కహరిజనవాడలో ఆదివారం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఉదయాన్నే టూటౌన్ సీఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి నక్కహరిజనవాడకు చేరుకుని తనిఖీలు చేపట్టారు. కాలనీలో ద్విచక్ర వాహనాల రికార్డులు, పలు దుకాణాలను తనిఖీ చేశారు.

కారణిమిట్టలో...

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కారణిమిట్ట పంచాయతీలో సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథనాయుడు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని ఎనిమిది బైక్‌లను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

దిక్సూచి
DIKSUCHI



"ప్రస్తుతం మనం అనుసరిస్తున్న పౌరస్మృతిలో మతతత్వ ఛాయలు ఉన్నాయి. మతం ఆధారంగా వివక్షను ప్రోత్సహించేలా ఉంది. దాని స్థానంలో 'లౌకిక పౌరస్మృతి'ని తీసుకురావాల్సిన అవసరం ఉంది" అని స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఎర్రకోటపై జాతీయ పతాకావిష్కరణ సందర్భంగా ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు కూడా అనేక సార్లు ఉమ్మడి పౌరస్మృతి గురించి చర్చించి, దీన్ని అమల్లోకి తేవాలని ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. దీంతో ఈ అంశం మరోసారి దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా 'ఉమ్మడి పౌరస్మృతి' అంటే ఏమిటి? చట్టాలు వ్యక్తిగతంగా ఉండాలా? మత పరంగా ఉండాలా? లేదా దేశ పౌరులందరికీ ఒకే చట్టం వర్తింప జేయాలా? అనే అంశాలను సమగ్రంగా చర్చిద్దాం.

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

ఉమ్మడి పౌరస్మృతి
'ఒకే దేశం - ఒకే చట్టం'

ఇండియన్ పాలిటీ

దొంగతనం, అత్యాచారం, హత్య... ఈ నేరాలు ఎవరు చేసినా వారి మతం, కులాలతో సంబంధం లేకుండా కోర్టులు శిక్షలు విధిస్తాయి. కానీ... పెళ్లి, విడాకులు, భరణం, దత్తత, వారసత్వం, మహిళలకు ఆస్తిహక్కు వంటి విషయాల్లో మాత్రం దేశ ప్రజలందరికీ ఒకే చట్టం వర్తించదు. హిందువులకు, ముస్లింలకు, క్రైస్తవులకు వారి వారి పర్సనల్ లాస్(మతం ఆధారంగా కల్పించిన వ్యక్తిగత చట్టాలు) ఆధారంగా శిక్షలు ఉంటాయి. అలాగే రాష్ట్రాలవారీగానూ అనేక చట్టాలు ఉన్నాయి. అలా కాకుండా పెళ్లి, విడాకులు, దత్తత, వారసత్వం, ఆస్తిహక్కు వంటి వాటి విషయాల్లో రాష్ట్రాలకు, మతాలకు అతీతంగా అందరికీ ఒకే చట్టం ఉండాలనే భావనకు ప్రతిరూపమే 'ఉమ్మడి పౌరస్మృతి'.

ఇతర దేశాల్లో ఉమ్మడి పౌరస్మృతి

- అమెరికాలో భిన్న మతాలను అవలంబించేవారు, భిన్న జాతులకు చెందిన ప్రజలు నివశిస్తున్నారు. అలాగని అక్కడ విడివిడిగా ప్రత్యేక చట్టాలు లేవు.
- ఫ్రాన్స్, జర్మనీ, చైనాలో కూడా మతాల ప్రాతిపదికన చట్టాలు లేవు.
- ఈజిప్ట్, మొరాకో, తుర్కియో వంటి ముస్లిం దేశాల్లోనూ అల్పసంఖ్యాక వర్గాలకు ప్రత్యేక చట్టాలు లేవు.

ముందు దేశపౌరుడు, ఆ తరవాతే మతం

ఓ మైనర్ ముస్లిం బాలిక వివాహానికి సంబంధించి కేరళ హైకోర్టు ఇటీవల ఒక తీర్పును వెలువరించింది. 15 ఏళ్ల లోపు వివాహం చేసుకునే హక్కు ఉందని బాలిక తండ్రి చేసిన వాదనను తిరస్కరించింది. 'ఏ వ్యక్తి అయినా ముందు దేశ పౌరుడని, ఆ తరవాతే ఆయా మతాల సభ్యులని పేర్కొంటూ.... హిందువైనా, ముస్లిమైనా, క్రిస్టియన్ అయినా.... అందరికీ బాల్య వివాహ నిషేధచట్టం(2006) వర్తిస్తుందని కేరళ హైకోర్టు 28 జూలై 2024న స్పష్టం చేసింది.


పర్సనల్ లాస్

మన దేశంలో పౌరుల వ్యక్తిగత అంశాలైన పెళ్లి, ఆస్తులు, వారసత్వం, దత్తత వంటి వాటికి సంబంధించి ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలను మతం ఆధారంగా రూపొందించారు. అవి... హిందూ వివాహ చట్టం(1955), హిందూ వారసత్వ చట్టం(1956), హిందూ దత్తత నిర్వహణ చట్టం(1956); భారతీయ క్రైస్తవ వివాహ చట్టం(1957), భారత విడాకుల చట్టం(1969); పార్శీ వివాహ, విడాకుల చట్టం(1936), ముస్లిం పర్సనల్ లా అప్లికేషన్ యాక్ట్(1937), ఈశాన్య రాష్ట్రాల సంప్రదాయ చట్టాలు, కశ్మీర్ సంప్రదాయ చట్టాలు మొదలైనవి.

(మిగతా రేపటి దిక్సూచిలో)



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్



ఎలిజిబిలిటీ టెస్ట్
రీజనింగ్

రీజనింగ్‌కి సంబంధించిన ఎలిజిబిలిటీ టెస్ట్ అనే ఈ టాపిక్‌కి చాలా ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా ఎస్.ఐ., బ్యాంకింగ్ మొదలైన పరీక్షల్లో ఈ విభాగం నుంచి ప్రశ్నలు అడిగే అవకాశం ఉన్నది.

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో ముందుగా ఏదైనా ఉద్యోగానికి, కళాశాలలో ప్రవేశానికి, బ్యాంకులో లోన్ లభించడానికి మొదలైన వివిధ అంశాలకు అర్హతలు నిర్ణయిస్తారు. తదుపరి వివిధ వ్యక్తుల వ్యక్తిగత సమాచారం (పర్సనల్ డేటా) తెలుసుకుంటారు. ఆ సమాచారంలోని అంశాలు ప్రశ్నలో ఇచ్చిన అర్హతలకు సరిపోయిందా లేదా పరిశీలించి దానిని బట్టి ఐచ్ఛికాలుగా ఎ, బి, సి, డి, ఇ లలో సరైన దానిని సమాధానంగా గుర్తించాలి. గ్రూప్ 1 కోచింగ్‌ను అందించే ఒక ప్రముఖ శిక్షణసంస్థలో ఉచిత కోచింగ్ ప్రవేశానికి విద్యార్థికి తప్పనిసరిగా కింది అర్హతలు ఉండాలి.

1. విద్యార్థి కచ్చితంగా పోస్ట్ గ్రాడ్యుయేట్ చదివి ఉండాలి. పోస్ట్ గ్రాడ్యుయేట్‌లో తప్పనిసరిగా ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత పొంది ఉండాలి.
2. విద్యార్థి వయసు 2023 మే 25 నాటికి 22 సంవత్సరాలకు తగ్గకూడదు, 30 సం॥లకు మించకూడదు.
3. విద్యార్థి సంరక్షకుల వార్షికాదాయం లక్ష రూపాయలకు మించకూడదు.
4. విద్యార్థి కోచింగ్ శిక్షణాకాలం పూర్తయిన తరవాత రెండు నెలలు లేదా పరీక్ష తేదీ వరకు (ఏదీ ముందు జరిగితే అలా) తప్పనిసరిగా కోచింగ్ నిర్వాహకులు తెలిపిన విధంగా ప్రిపరేషన్ కొనసాగిస్తూ శిక్షణసంస్థలోనే ఉండాలి.
5. ఆ సంస్థ ద్వారా ఉచిత కోచింగ్ పొంది ఉద్యోగానికి ఎన్నికైతే తప్పనిసరిగా ఆ సంస్థకు 50,000 రూపాయలను విరాళంగా ఇవ్వడానికి సుముఖత తెలుపుతూ అంగీకారపత్రంపై సంతకం చేయాలి.
6. పై వాటిలో ఒకటో అర్హతకు బదులుగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత చెంది గ్రాడ్యుయేషన్‌లో 75% మార్కులు ఉన్నట్లయితే ఆ విద్యార్థి విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.
7. పై వాటిలో అయిదో పాయింట్‌లో సూచించిన విధంగా అంగీకార పత్రానికి బదులు శిక్షణా కాలం జరుగుతున్న సమయంలోనే రూ.15,000/- చెల్లించడానికి సుముఖత తెలిపితే అభ్యర్థి విషయం కోచింగ్ సంస్థ (శిక్షణ సంస్థ) డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది.

పైన పేర్కొన్న అర్హతలు, నియమ నిబంధనలకు లోబడి కింద ఇచ్చిన వివిధ విద్యార్థుల వ్యక్తిగత సమాచారాన్ని ఆధారంగా చేసుకొని ఐచ్ఛికాల్లో తెలిపిన సమాధానాల్లో ఏది సరైనదో నిర్ణయించండి.

1. అవినాష్ ఎంటెక్ 70% మార్కులతో పూర్తి చేశాడు. పుట్టిన తేదీ 2002 జూన్ 1. అవినాష్ సంరక్షకుల వార్షికాదాయం రూ.96,000. అవినాష్ శిక్షణ పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ దగ్గరే ఉండటానికి, అయిదో పాయింట్‌లో తెలిపినట్లు అంగీకారపత్రంపై సంతకం చేశాడు.

ఎ) అవినాష్ గురించి ఇచ్చిన వ్యక్తిగత సమాచారం సరిపోదు
బి) అవినాష్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.
సి) అవినాష్ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
డి) అవినాష్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
ఇ) అవినాష్ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది.

సమాధానం: (డి)

వివరణ: అవినాష్ పుట్టిన తేదీ 2002 జూన్ 1. ప్రశ్నలో తెలిపిన 2023 మే 25 నాటికి అవినాష్‌కి 21 సంవత్సరాలు మాత్రమే. వయసు సరిపోదు కాబట్టి అవినాష్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు.

2. దినేష్ ఎమ్మే 56% మార్కులతో పూర్తి చేశాడు. అతను పుట్టినతేదీ 1996 ఆగస్టు 24. డిగ్రీలో అతనికి 82% మార్కులు లభించాయి. దినేష్ సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.93,000/-. శిక్షణ పూర్తయిన తరవాత పరీక్ష తేదీ వరకు శిక్షణసంస్థ వద్దే ఉండటానికి నిర్ణయించుకున్నాడు. అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకార పత్రంపై సంతకం చేశాడు.

ఎ) దినేష్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
బి) దినేష్ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
సి) దినేష్ ఇచ్చిన సమాచారం సరిపోదు.
డి) దినేష్ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది ఇ) దినేష్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది

సమాధానం: (ఇ)

వివరణ: దినేష్‌కు ఇచ్చిన అర్హతలలో 2, 3, 4, 5 అర్హతలు ఉన్నాయి. ఒకటో అర్హతకు బదులుగా 6వ పాయింట్‌లో తెలిపిన విధంగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయశ్రేణిలో ఉత్తీర్ణత చెంది గ్రాడ్యుయేషన్‌లో 82% మార్కులు పొందడం వలన దినేష్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.

3. వికాస్ ఎమ్మెస్సీ 70% మార్కులతో పూర్తి చేశాడు. అతని సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.60,000/-. కోచింగ్ పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ వద్దనే ఉండటానికి నిశ్చయించుకుని అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకారపత్రంపై సంతకం చేశాడు.

ఎ) వికాస్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
బి) వికాస్ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
సి) ఇచ్చిన సమాచారం సరిపోదు
డి) వికాస్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది
ఇ) వికాస్ విషయం శిక్షణాసంస్థ డైరెక్టర్ పరిశీనలకు వెళుతుంది

సమాధానం: (సి)

వివరణ: వికాస్ పుట్టినతేదీ గురించి ఎటువంటి సమాచారం లేదు.

4. తేజ ఎమ్మే 75% మార్కులతో పూర్తి చేశాడు. అతని సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.78,000/-. కాని శిక్షణ పొందడానికి 15,000/- చెల్లించడానికి అంగీకరించాడు. శిక్షణకాలం పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ వద్దే ఉండటానికి నిర్ణయించుకున్నాడు. కాని అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకారపత్రంపై సంతకం చేయలేదు. తేజ పుట్టిన తేదీ 1996 జూన్ 11.

ఎ) తేజ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
బి) తేజ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది
సి) తేజ గురించి ఇచ్చిన వ్యక్తిగత సమాచారం సరిపోదు డి) తేజ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
ఇ) తేజ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.

సమాధానం: (బి)

వివరణ: తేజకు ఇచ్చిన అర్హతలలో 1, 2, 3, 4 అర్హతలు ఉన్నాయి. అయిదో అర్హతకు బదులుగా ఏడో పాయింట్‌లో తెలిపిన విధంగా రూ.15,000/- చెల్లిస్తున్నందున తేజ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది.

5. ప్రశాంత్ ఎంకామ్ 65% మార్కులతో పూర్తి చేశాడు. ప్రశాంత్ శిక్షణ పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ వద్దే ఉండడానికి నిర్ణయించుకున్నాడు. అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకార పత్రంపై సంతకం చేశాడు. అతను పుట్టిన తేదీ 1994 ఏప్రిల్ 4. ప్రశాంత్ సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.1,20,000/-.

ఎ) ప్రశాంత్ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది
బి) ప్రశాంత్ ఉచిత శిక్షణకు అర్హుడు
సి) ప్రశాంత్ ఉచిత శిక్షణకు అనర్హుడు
డి) ప్రశాంత్ గురించి ఇచ్చిన వ్యక్తిగత సమాచారం సరిపోదు ఇ) ప్రశాంత్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.

సమాధానం: (సి)

వివరణ: ప్రశాంత్ సంరక్షకుల వార్షికాదాయం రూ.1,20,000/-లు. మూడో అర్హతలో వార్షికాదాయం లక్ష రూపాయలకు మించకూడదని ఉన్నది. కాబట్టి ప్రశాంత్ ఉచిత శిక్షణకు అనర్హుడు.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

హెల్మెట్ ఏదీ గోవిందా..!



హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనదారులు

తిరుమల ఘాట్‌రోడ్లలో ద్విచక్రవాహనదాల భద్రత నిమిత్తం టీటీడీ గత కొన్నేళ్లుగా హెల్మెట్ తప్పనిసరి నిబంధనను అమలుచేస్తున్న విషయం తెలిసిందే. అయితే తిరుమలకు వచ్చే, వెళ్లే ఉద్యోగులు, భక్తులు, వ్యాపారులు, స్థానికులు హెల్మెట్ నిబంధనను కేవలం తనిఖీలకు మాత్రమే పరిమితం చేస్తున్నారు. అలిపిరి చెక్ పాయింట్‌లో హెల్మెట్ ఉందని భద్రతా సిబ్బందికి చూపించి దాటిన తర్వాత దానిని బైక్‌లపై మోసుకుపోతున్నారే తప్ప ధరించడం లేదు. అత్యంత వేగంగా ప్రయాణిస్తూ హెల్మెట్ వాడకాన్ని విస్మరిస్తున్నారు. ఇటీవల తమిళనాడుకు చెందిన భక్తులు కూడా హెల్మెట్‌ను ధరించకుండా ప్రయాణించిన నేపథ్యంలో బస్సు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. అయినప్పటికీ భద్రతా సిబ్బంది కోసం అన్నట్టుగా కేవలం అలిపిరి చెక్‌పాయింట్, తిరుమలలో జీఎన్సీ టోల్‌గేట్‌ల వద్ద మాత్రమే ధరించి ఆ తర్వాత హెల్మెట్ తీసేస్తున్నారు. ఈక్రమంలో ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించడంతోపాటు తప్పనిసరిగా ధరించేలా మార్గమధ్యంలో తనిఖీలు చేయాల్సిన అవసరం ఉంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కిక్కిరిసిన ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తి, ఆగస్టు 25: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. వారాంతపు సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుం డా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 27వేలమంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇందులో రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,633మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,645మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 టిక్కెట్ల ద్వారా 2,645మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,129, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 312మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 243మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 77మంది భక్తులు రాహుకేతు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 16,301 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.



ముక్కంటి ఆలయం వద్ద ఉన్న భక్తులు

చెల్దిగానిపల్లెలో దొంగల స్వైరవిహారం

● భారీగా వెండి, బంగారం చోరీ

రామకుప్పం, ఆగస్టు 25: రామకుప్పం మండలం చెల్దిగానిపల్లెలో శనివారం రాత్రి దొంగలు స్వైరవిహారం చేశారు. తాళాలు వేసిన ఇంటి తలుపులు బద్దలగొట్టి భారీగా వెండి, బంగారం తీసుకెళ్లారు. బాధితులు తెలిపిన ప్రకారం.. దేవేంద్ర, ఆయన భార్య గ్రామంలో వ్యవసాయం చేస్తూ.. జాతీయ రహదారి పక్కన తమ ఇంట్లో నివసిస్తున్నారు. శనివారం సాయంత్రం వారు బెంగళూరులో ఉద్యోగాలు చేస్తున్న కుమార్తె, కుమారుడు వద్దకు వెళ్లారు. ఆదివారం సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చారు. ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో అనుమానించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరచి ఉన్నాయి. వస్తువులు చిందరవందరగా పడున్నాయి. బీరువాలో 1.30కిలోల వెండి, 82గ్రాముల బంగారం, రూ.20వేలు నగదు దుండగులు తీసుకెళ్లినట్లు గుర్తించారు. ఈ మేరకు దేవేంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దుండగులు పగులగొట్టిన తలుపు, బీరువా

పతనమవుతున్న ధాన్యం ధరలపై దిగాలు

● దళారుల చేతిలో మోసపోతున్న రైతులు

సూళ్లూరుపేట, ఆగస్టు 25: ధాన్యం ధరలు రోజురోజుకూ పడిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో పరిధిలోని పలు గ్రామాల్లో ఫిల్టర్ పాయింట్ నీటి సౌకర్యం ఉండే ప్రాంతాల్లో దాదాపు 7 వేల ఎకరాల్లో రైతులు వరి కోతలకు సిద్ధమయ్యారు. నాట్ల ప్రారంభంలో అడపాదడపా వర్షాలు కురియడంతో రైతులు ఉత్సాహంగా సాగుచేశారు. ఎం2-1010 రకం, కేఎన్ఎం-1638 రకాలను ఎక్కువగా చేశారు. అప్పులు చేసి అధిక పెట్టుబడులు పెట్టారు. చాలాచోట్ల పంట కోత దశకు చేరుకుంది. మంగానెల్లూరు, మంగళంపాడు, మన్నారుపోలూరు తదితర ప్రాంతాల్లో కోస్తున్నారు. ఇదే సమయంలో ధాన్యం ధరలు పతనమవ్వడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. వారం రోజుల ముందు పుట్టి రూ.17400 నుంచి రూ.18,200 వరకు ఉంది. ప్రస్తుతం రూ.15,500 నుంచి రూ.16,000కు పడిపోయింది. కేఎన్ఎం 1638 రకం పుట్టి వారం రోజుల క్రితం రూ.22 వేలు దాకా పలికింది. ప్రస్తుతం రూ.20 వేలకు పడిపోయిందని సమాచారం. మరోపక్క దళారులు మాయమాటలు చెప్పి తక్కువ ధరలకు కొనేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దళారులు ఇక్కడ కొనుగోలు చేసి తమిళనాడులో అధిక ధరలకు విక్రయించుకొని సొమ్ము చేసుకొంటున్నారు.



ధాన్యాన్ని లారీలకు లోడ్ చేస్తున్న కూలీలు

జగనన్న కాలనీలో ఇంటి స్థలాల విక్రయం

అడ్డుకున్న చిన్నపాండూరు గ్రామస్తులు

వరదయ్యపాళెం, ఆగస్టు 25: జగనన్న కాలనీలో ఇంటి స్థలాలను విక్రయిస్తున్న వైసీపీ నేతను స్థానికులు అడ్డుకున్నారు. వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరు పంచాయతీ పరిధిలోని చిన్నపాండూరు - పెద్దపాండూరు మార్గంలో ఆంజనేయస్వామి విగ్రహం సమీపంలో సర్వే నెంబరు 68/8, 9లో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలంలో నాలుగేళ్ల కిందట జగనన్న కాలనీ పేరిట ఇంటి స్థలాలను మంజూరు చేశారు. కొందరు గృహనిర్మాణాలు చేపట్టారు. కొందరు బినామీల పేరిట పట్టాలు పొంది, అనర్హులకు విక్రయించారు. మరికొంత స్థలం ఖాళీగా ఉండడంతో స్థానిక గిరిజనులు తాత్కాలిక గుడారాలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ ఖాళీ భూమిపై స్థానిక వైసీపీ నాయకులు కన్నేశారు. చిన్నపాండూరు వద్ద హీరో, అపోలో వంటి పరిశ్రమలు రావడంతో అక్కడి భూముల ధరలు అమాంతం పెరిగాయి. కార్మికులు, ఉద్యోగుల నివాసాల కోసం ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి భారీ నివాస గృహాలు, బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో అక్కడ నివాస స్థలాలకు గిరాకీ ఏర్పడింది. సెంటు స్థలం ధర లక్షల్లో పలుకుతోంది. ఈ నేపథ్యంలో ఖాళీగా భూమి విక్రయించడానికి వైసీపీ నాయకులు సిద్ధమయ్యారు. రెండురోజుల కిందట సెంటు స్థలం రూ.1.50 నుంచి రూ.2లక్షల చొప్పున ఒక్కో ప్లాటును రూ.5లక్షలకు విక్రయించడంతో స్థానికులు అడ్డుకున్నారు. పేదల ఇంటి స్థలాలు కోసం కేటాయించిన భూమిని ఎలా విక్రయిస్తారని నిలదీశారు. రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినా చర్యలు తీసుకోకపోవడంతో వారి పాత్రపైనా స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై తహసీల్దారు రాజశేఖర్‌ను వివరణ కోరగా చిన్నపాండూరులోని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా స్థలాలు కొనుగోలు చేసినా, నిర్మాణాలు సాగించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.



అక్రమార్కులను అడ్డుకుంటున్న గ్రామస్తులు

1నుంచి బీజేపీ సభ్యత్వం: పురందేశ్వరి



సర్పవరం జంక్షన్ (కాకినాడ), ఆగస్టు 25: 'పదకొండవ ఆర్థిక శక్తిగా ఉన్నటువంటి భారతదేశాన్ని ప్రధాని మోదీ పాలనలో ఐదో ఆర్థిక శక్తిగా అవతరించి ప్రపంచ పటంలో ఆవిష్కరించింది. రాబోయే ఆర్థిక సంవత్సరంలో మూడో ఆర్థికశక్తిగా చూడాలనే దిశగా బీజేపీ కూటమి ప్రయత్నిస్తోంది' అని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి అన్నారు. ఆమె కాకినాడలో పార్టీ సభ్యత్వ నమోదుపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. సెప్టెంబరు 1 నుంచి ప్రారంభించే పార్టీ సభ్యత్వ నమోదుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. 37 లక్షల మంది సభ్యత్వ నమోదు లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆమె తెలిపారు. కాగా, త్వరలో జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమి తమ మేనిఫెస్టోలో ఆర్టికల్ 370, 35ఏలను పునరుద్ధరిస్తామని ప్రకటించడాన్ని బట్టి దేశాన్ని విచ్ఛిన్నం చేసే రీతిలో వ్యవహరిస్తారని మండిపడ్డారు. దీనిపై రాహుల్ గాంధీ ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా డీఎస్సీ అభ్యర్థులకు
ఉచిత శిక్షణ: భువనేశ్వరి



హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ద్వారా పేద అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా కుప్పంలో ఈ శిక్షణ ఉంటుందని, అర్హులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందిస్తామని తెలిపారు.